ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 18, జూన్ 2025



దొనకొండ విమానాశ్రయ భూమి పరిశీలిస్తున్న గన్నవరం ఎయిర్‌పోర్టు అధికారులు (ఫైల్)

దొనకొండ దిశగా అభివృద్ధి

ఏడాది పాలనలో చిగురిస్తున్న ఆశలు

- సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై మంత్రి రవికుమార్ ప్రకటన
- డిఫెన్స్ మ్యానుఫ్యాక్చర్ హబ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రకటన
- 380 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుపై దృష్టి సారించిన ప్రభుత్వం
- చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు కోసం భూములను పరిశీలించిన మహారాష్ట్ర ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు
- పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో పలు కంపెనీలు ఇప్పటికే తమకు అవసరమైన భూములను పరిశీలించి వెళ్లాయి. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఇక్కడ తమకు అవసరమైన సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చూస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో దొనకొండలో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం, ప్రధాన రైలుమార్గం కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. అందుకే పలు కీలక పరిశ్రమల దృష్టి పడింది. వీటి రాకతో దొనకొండ దశ మారనుందని ప్రజలు భావిస్తున్నారు.



దొనకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అడుగులు పడుతున్నాయి. దొనకొండ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో దొనకొండ కారిడార్ అభివృద్ధిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు ఖాయమని ప్రజలు భావిస్తున్నారు. దీంతో ఎంతో వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉద్యోగులు, పేదలకు ఉపాధి అవకాశాలు ఖాయమనే చర్చ నడుస్తోంది. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దొనకొండలో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకెళ్తుండటంతో ఇక్కడ కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపిందని ప్రజలు భావిస్తున్నారు.

ఐదు వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు

ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక పారిశ్రామిక సంస్థలు వచ్చాయి. జిల్లాలోనూ పలువురు బడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ క్రమంలోనే దొనకొండలోనూ పరిశ్రమలు స్థాపించేందుకు అడుగులు

మిగతా 6లో...



గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఆయా ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఈ నెలాఖరులోపు బదిలీలను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో తదనుగుణంగా అధికారులు చర్యలను ప్రారంభించారు. జిల్లాలో గ్రామ సచివాలయాలు 597, వార్డు సచివాలయాలు 122 కలిపి 721 ఉన్నాయి. అందులో గ్రామ సచివాలయాల్లో 5,566 మంది, వార్డు సచివాలయాల్లో 1,058 మంది ఉద్యోగులు కలిపి 6,624 మంది పనిచేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను 2019లో ఏర్పాటు చేశారు. అప్పట్లో కొత్త నియామకాలు చేపట్టి భర్తీచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులను సొంత మండలంలోనే నియమించింది.

- ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

సచివాలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

- 90శాతానికిపైగా స్థానచలనం
- ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల్లో కసరత్తు
- ఐదేళ్ల సర్వీసుతోపాటు సొంత మండలంలో పనిచేస్తున్న వారందరూ మారాల్సిందే

పూర్తిస్థాయిలో మార్పు

ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను నియమించి ఐదేళ్లు పూర్తికావడంతో బదిలీలు చేపట్టాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులను సొంత మండలంలో కాకుండా ఇతర మండలాలకు బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రస్తుతం

మిగతా 6లో...



ఒంగోలులోని రాజాపానగల్ రోడ్డులోని వార్డు సచివాలయంలో 'తల్లికి వందనం' కోసం అర్జీ పెట్టుకుంటున్న లబ్ధిదారులు

'తల్లికి వందనం'కి గ్రీవెన్స్

- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు
- 20లోపు ఆధారాలతో అర్జీలు
- కొత్తగా చేరే వారికి 30 వరకు అవకాశం

ఒంగోలు విద్య, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అర్హులైన తల్లులకు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. గత సంవత్సరం నుంచి విద్యా సంస్థల్లో కొనసాగుతూ ఉండి అర్హత కలిగి నగదు జమకాని విద్యార్థులకు మరో అవకాశం కల్పించింది. ఏ కారణంతో వారి తల్లుల ఖాతాలకు నగదు జమకాలేదో తెలుసుకొని తగు ఆధారాలతో అర్జీ ఇస్తే రెండో విడత వచ్చేనెల 5న వీరి ఖాతాలకు నగదు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేసింది. తల్లులకు ఏ కారణంతో తిరస్కరించారనే వివరాలు ఆ సచివాలయాల్లోనే తెలుస్తాయి. ఆ వివరాలు తెలుసుకొని అర్హత ఉన్నా తప్పుగా తమను అనర్హులుగా తేల్చారని తల్లులు భావిస్తే అందుకు తగిన ఆధారాలతో ఈనెల 20లోపు నిర్ణీత ప్రొఫార్మాలో అర్జీని పూరించి ఆధారాలతో జతచేసి సమర్పించాలి. అందుకోసం ప్రభుత్వం ఈనెల 20 వరకు అవకాశం కల్పించింది. అలా వచ్చిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చివరగా జాయింట్ కలెక్టర్ వివరాలను పరిశీలించి అర్హులని తేల్చి ఆ జాబితాకు

మిగతా 6లో...

30లోపు నమోదైతే అవకాశం

ప్రస్తుతం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం 2025-26 విద్యా సంవత్సరానికి అమలు చేస్తున్నారు. ఈనెల 30లోపు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి జూనియర్ కళాశాలల్లో చేరిన వారికి కూడా జూలై 5న నగదు జమ చేస్తారు. ఒకటో తరగతిలో చేరేవారికి విద్యాసంస్థ ద్వారానే ఆన్‌లైన్ అవుతాయి. అలా ఈనెల 30లోపు తుది జాబితా విడుదల అవుతున్న నేపథ్యంలో నెలాఖరులోపు చేరేవారు మాత్రమే తల్లికి వందనం కింద లబ్ధిపొందేందుకు అవకాశం ఉంది. గడువులోపు పిల్లలను పాఠశాలలు, కళాశాలల్లో చేర్పి లబ్ధి పొందాలని ప్రభుత్వం కోరుతుంది.



వైద్య ఉద్యోగులకు బదిలీల వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

వైద్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల వెబ్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలు క్యాడర్ల ఉద్యోగుల బదిలీలకు ప్రక్రియ నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, టైపిస్టులు, ఆఫీసు అటెండర్లు, జూనియన్ సహాయకులు, వాచ్‌మెన్లు, ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు, స్వీపర్లు వారు పనిచేస్తున్న కార్యాలయం నుంచి వెబ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా కేడర్ల వారీగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా స్ర్కీన్‌పై ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచారు. వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్, డేటా మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో బదిలీలకు షెడ్యూల్

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బంది, సీఆర్‌ఎంటీలు, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఈఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీసు సబార్డినేట్లు, సైట్ ఇంజనీర్లు తదితరులను బదిలీ చేస్తారు. బదిలీలు పరస్పరం, అభ్యర్థన మేరకు మాత్రమే జరుగుతాయి. రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసిన వారిని మాత్రమే బదిలీ చేస్తారు. జిల్లా, మండల స్థాయిలో బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేశారు. జిల్లాస్థాయిలో బదిలీలకు ఈనెల 19 నుంచి 21 వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న బదిలీల సీనియార్టీ జాబితా తయారు, 24న సీనియార్టీ జాబితా ప్రకటన, 27న సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 28న అభ్యంతరాలు పరిష్కరించి తుది జాబితాను ప్రకటిస్తారు. 30 నుంచి జూలై 2 వరకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారని డీఈవో, సమగ్ర శిక్ష డీపీవో కిరణ్‌కుమార్ తెలిపారు. అంతర్ జిల్లా బదిలీలు కోరుకునే ఉద్యోగులు రెండు రోజుల్లో తమ దరఖాస్తులు సమర్పిస్తే రాష్ట్ర కార్యాలయానికి పంపుతామని డీఈవో తెలిపారు.

- సాగుకు సన్నద్ధమైన వేళ అవగాహన శిబిరాలు
- ప్రారంభమైన పొలం పిలుస్తోంది
- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సలహాలు, అన్నదాత సుఖీభవపై ప్రచారం



త్రిపురాంతకంలో 'పొలం పిలుస్తోంది'లో రైతులతో వ్యవసాయాధికారులు

వ్యవసాయ శాఖ రైతు చెంతకు

ఒంగోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయశాఖ రైతు బాట పట్టింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సీజన్ ప్రారంభ సమయంలో సాగుకు సంబంధించి చేపట్టే చర్యలపై సాంకేతిక సలహాలు, సూచనలు లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించి రైతులు పంటలు వేసేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో ఈ సీజన్ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని జిల్లాలో ఆ శాఖ అధికారులు ఉత్సాహంగా చేపట్టారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారు. రైతు సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోవడం లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వైసీపీ ప్రభుత్వంలో మొక్కుబడిగా ఈ తరహా కార్యక్రమం సాగగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) యూనిట్‌గా పొలం పిలుస్తోందిని విస్తృతంగా నిర్వహిస్తోంది.

రైతులతో గ్రూపు మీటింగ్‌లు

ప్రస్తుత ఏడాది మేలోనే మంచి వర్షాలు కురిశాయి. అనంతరం పది రోజులు ఆగి మళ్లీ జల్లులు పడ్డాయి. సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాల్లో రైతులు పొలం పనులకు సన్నద్ధమయ్యారు. అత్యధిక ప్రాంతాల్లో దున్నకాలు జరుగుతుండగా కొన్నిచోట్ల సజ్జ, పెసర, నువ్వు, కంది వంటి పంటల విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే వేసవి పత్తి, పశుగ్రాస పంటలను వేశారు. ఒక మోస్తరు వర్షం ఈవారంలో పడితే కంది, పత్తి, సజ్జ, మినుము ఇతరత్రా పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం కాగా ప్రస్తుతం పొలంలో పంటలు అంతగా లేకపోవడంతో రైతులతో గ్రూపు మీటింగ్‌లు ఏర్పాటు చేసి ఈ సీజన్‌పై చర్చించారు. అన్నదాత సుఖీభవ పథకంపై ఈ శిబిరాలలో ప్రచారం చేస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీపై విత్తనాలు అందజేతలపైనా వివరిస్తున్నారు. నెలాఖరు నుంచి పొలాలకు వెళ్లి ఆయా పంటలపై రైతులకు సాంకేతిక సలహాలు ఇచ్చేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

7

- మెప్మా అధికారులతో సమావేశంలో కలెక్టర్ అన్సారియా

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

- ఇంజన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహం
- వాహనం అదుపు తప్పడం వల్ల ప్రమాదం

7



అప్‌డేట్ కష్టాలు

- పిల్లల ఆధార్ నమోదు కోసం అవస్థలు
- పోస్టాఫీసు వద్ద బారులు తీరిన మహిళలు

7

దొనకొండ దిశగా అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)
పడుతున్నాయి. ఐదువేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తామని ఇప్పటికే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం కనిగిరి ఆర్డీవో ఇతర అధికారులు భూములను పరిశీలించారు. ఇటీవల భూముల తాజా పరిస్థితిపై రెవెన్యూ అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు.

ఏపీఐఐసీకి భూములు

తాజాగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రైవేట్ ఇండస్ట్రీయల్ పార్కుల పాలసీ కింద పది భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో దొనకొండలో 380 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగేలా రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దొనకొండ మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, రుద్రసముద్రం, భూమనపల్లి గ్రామాలకు చెందిన 2,395 ఎకరాల ప్రభుత్వ ఇప్పటికే ఏపీఐఐసీకి అప్పగించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన భారీ పారిశ్రామిక పార్క్ ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

డిఫెన్స్ మ్యానుఫ్యాక్చర్ హబ్

ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల ఏర్పాటు గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి చర్చించారు. అనంతరం దొనకొండ ప్రాంతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు చెందిన డిఫెన్స్ మ్యానుప్యాక్చర్ హబ్ కింద మిసైల్ ఎవియేషన్ ప్రాజెక్టు ఆరు వేల ఎకరాల్లో ఏర్పాటుకు విజ్ఞప్తి చేసినట్లు ప్రకటించారు. ప్రభుత్వ ప్రోత్సాహంలో భాగంగా దొనకొండ ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం మహారాష్ట్రకు చెందిన ఏరోస్పేస్ పయనీర్ క్లీన్ యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు 50 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం గత నెల ఈ ప్రాంతంలోని అనువైన భూములను పరిశీలించారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు అథారిటీ శిక్షణ కేంద్రం ఏర్పాటు నిమిత్తం అన్నీ జిల్లాల్లోని విమానాశ్రయాలను పరిశీలించే క్రమంలో గన్నవరం ఎయిర్‌పోర్టు అధికారులు గతనెల దొనకొండలోని ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు ఈ బృందం వచ్చినట్లుగా విశ్వసనీయ సమాచారం.

'తల్లికి వందనం'కి గ్రీవెన్స్

(5వ పేజీ తరువాయి)
ఆమోదముద్ర వేస్తే వారికి జూలై 5న నగదు జమ అవుతుంది.

పథకానికి అర్హులు వీరే..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి చదువుతున్న పేద కుటుంబాల విద్యార్థులు తల్లికి వందనం పథకం పొందేందుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12వేలు ఆదాయం మించనివారు, కుటుంబంలో కనీసం ఒకరికైనా బియ్యం కార్డు ఉన్నవారు, మూడు ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట భూమి మించనివారు, నాలుగు చక్రాల వాహనాల్లో ట్యాక్సీ, ట్రాక్టర్లు ఉన్నవారు, విద్యుత్ బిల్లు నెలకు సగటున 300 యూనిట్లకు మించనివారు, పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో వెయ్యి చదరపు అడుగులలోపు స్థలం ఉన్నవారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు అర్హులు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు రూ.10వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేల లోపు ఆదాయం ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. నవోదయ, ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు కాదు. ఇలా ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంటే తల్లికి వందనం పథకం వర్తిస్తుంది. బేస్తవారాపేట మండలం పిటికాయగుళ్ల జడ్పీ హైస్కూలు చదువుతున్న ఒకరికి ఈ పథకం నగదు పడలేదు. దీంతో వారు ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం, డీఈవో కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ఆటో ఢీకొని ద్విచక్రవాహన దారునికి గాయాలు

మార్టూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మార్టూరు నుంచి నాగ రాజుపల్లి వెళ్లే మార్గంలో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుపల్లి గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు ఎం.హను మయ్య రోడ్డుపై పడి గాయపడ్డాడు. దీంతో ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఏబీసీ కాలువలను కమ్మేసిన చిల్లచెట్లు

- చిట్టడవిని తలపిస్తున్న కాలువ కట్ట
- ముళ్లచెట్లతో మూసుకుపోయిన దారి
- తక్షణమే మరమ్మతు చేయాలంటున్న రైతులు

బల్లికురవ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువ కట్ట చిట్టడవిని తలపించేలా ముళ్లచెట్లతో మూసుకుపోయిది. దీంతో కాలువ కట్ట గుండా పోలాలకు వెళ్లే రైతులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బంది పడుతు న్నారు. పెద్ద చెట్లతో కాలువ కట్టపై గుండా వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



సూరేపల్లి వద్ద చిట్టడవిని తలపిస్తున్న కాలువ కట్ట



పైదన వద్ద కాలువకట్టపై ఉన్న ముళ్లచెట్లు

అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువ ప్రారంభం అయ్యే 18 వ మైలు నుండి దిగువ భాగంలో ఉన్న 38వ మైలు వరకు పలు చోట్ల పెద్ద ఎత్తున ముళ్ల చెట్లు అల్లుకోని ఉన్నాయి. కాలువ కట్టపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాం దోళన చెందుతున్నారు. ముళ్ల పొదల మధ్య గుండా వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు అంటున్నారు. సంత మాగులూరు, బల్లికురవ, అద్దంకి, మార్టూరు, పంగులూరు, తదితర మండలాల పరిధిలో ఉన్న ఏబీసీ కాలువ కట్టపై ముళ్ల చెట్లు అధికంగా ఉన్నాయని రైతులు తెలిపారు. రానున్న పంట సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే కాలువ కట్టను మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని వైదన, సూరేపల్లి గ్రామాల వద్ద అయితే ఏబీసీ కాలువ కట్టపై దట్టంగా ముళ్ల చెట్లు ఉన్నా యని రైతులు తెలిపారు. కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలో అయితే చెట్లు తొలగించే పనులు చేయటం కష్టం అని వారు అంటున్నారు. ఏబీసీ కాలువ పరిధిలో సుమారు 20 కిలోమీటర్ల మేర ముళ్లచెట్లు ఉన్నాయని వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

(5వ పేజీ తరువాయి)
పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో సుమారు 90శాతం వరకు సొంత మండలంలో పనిచేస్తుండగా కేవలం 10 శాతం మాత్రమే ఇతర మండలాల్లో పని చేస్తున్నారు. దీంతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల్లో పది శాఖలకు సంబంధించి ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ, సర్వే, పోలీస్, ఉద్యాన, ఎనర్జీ తదితర శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉన్నారు. దీంతో ఆయా శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులను బదిలీలు చేసేందుకు కసరత్తును ప్రారంభించారు.

రేషనలైజేషన్ అమలు

ఇప్పటికే ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన సచివాలయాలను రేషన్‌లైజేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం జనాభాతో సంబంధం లేకుండా సచివాలయాల్లో 8 నుంచి 11మంది వరకు పనిచేస్తున్నారు. ప్రస్తుత రేషనలైజేషన్ ప్రకారం మూడు కేటగిరీలుగా సచివాలయాలను విభజించారు. ఏ కేటగిరీ సచివాలయంలో ఆరుగురు, బీ కేటగిరిలో ఏడుగురు, సీ కేటగిరీలో ఎనిమిది మంది ఉద్యోగులను నియమించే విధంగా చర్యలు తీసుకున్నారు. అలా రేషనలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తికావడంతో తదనుగుణంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ బదిలీల అనంతరం సచివాలయాల్లో మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖల ద్వారా ఇతర పనులను వినియోగించుకునే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ముందుగా ప్రభుత్వ శాఖల వారీగా ఉద్యోగుల వివరాలను కంప్యూటీకరణ చేస్తున్నారు.

నాయకుల ద్వారా సిఫార్సులు

ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగి ఎక్కడ పనిచేస్తున్నారు? సొంత మండలంలో పనిచేస్తున్నారా లేదా ఇతర మండలాల్లో పనిచేస్తున్నారా? లాంటి డేటా తయారు చేస్తున్నారు. కేవలం పది శాతం మంది ఉద్యోగులు మాత్రమే ఇతర మండలాల్లో పనిచేస్తుండగా మిగిలిన వారందరూ సొంత మండలాల్లోనే పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో ఇప్పుడు వారందరినీ సమీప మండలాలకు బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా ఆయా శాఖల అధికారులు చర్యలు ప్రారంభించారు. దీంతో సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ఇతర మండలాలకు బదిలీ కావాల్సి ఉండటంతో వారు పరుగులు పెడుతున్నారు. తదనుగుణంగా తమకు తెలిసిన నాయకుల ద్వారా సిఫార్సులను చేయించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే ఆశాఖల అధికారులకు కొన్ని ప్రాంతాల నుంచి సిఫార్సు లేఖలు కూడా అందినట్లు సమాచారం.

అక్రమ రిసార్ట్ నిర్మాణం అడ్డగింత

విజయలక్ష్మీపురం(చీరాల), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సముద్రంలో వేట సాగించి జీవనంసాగిస్తున్న మత్స్యకారుల జీవనవిధానాలతో ఆక్రమణ దారులు చెలగాటమాడుతున్నారు. చీరాల మండలం విజయలక్ష్మీపురం వద్ద తీరంలోకి ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇది వాస్తవానికి బాపట్ల మండలం అడవిపల్లి పాలెం పరిధిలో ఉండగా, వేట విరామ సమయంలో విజయలక్ష్మీపురం, దానవాయిపేట, వాడరేవు, అడవిపల్లెపాలెం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు బోటులు నిలుపుకుంటున్నారు. దీనిపై కన్నేసిన ఆక్రమణదారులు కాలువ పూడ్చి రిసార్ట్ నిర్మించేందుకు పథకం పన్నారు.



చదును చేయడాన్ని అడ్డుకుంటున్న మత్స్యకారులు

దీంతో సమాచారం అందుకున్న మత్స్యకారులు ఆక్రమణలు అడ్డగించారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అయితే ఇది తమకు చెందిందని అవతలి వర్గం చెబుతున్నారు. మత్స్యకారులు మాత్రం పెద్దఎత్తునే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బాపట్ల అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కబెట్టారు. విషయంపై ఆరా తీస్తున్నారు.

అద్దంకిలో అలంకారప్రాయంగా ఆటోనగర్

అద్దంకి, జూన్17(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని ఆటోనగర్ అలంకారప్రాయంగా మారింది. మూడు దశాబ్దాల క్రితం శింగరకొండ రోడ్డుకు సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేసి సుమారు 100 మంది కార్మికులకు కేటాయించారు. అయితే కొంతకాలం పాటు మౌలిక వసతులు లేవని మెకానిక్ షెడ్డులు ఏర్పాటు కాలేదు. సుమారు దశాబ్ద కాలం క్రితం ఆటోనగర్‌కు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అయితే మెకానిక్ షెడ్లు మాత్రం వేళ్ళ మీద లెక్కపెట్టే స్థాయిలో మాత్రమే ఏర్పాటు చేశారు. అత్యధికశాతం ప్లాట్లు పొందిన వ్యక్తులు, మెకానిక్ లు ఇతరులకు అమ్మకాలు చేశారు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంకా అత్యధిక శాతం



ఖాళీగా ఉన్న స్థలాలు



ఆటోనగర్‌లో మెకానిక్ షెడ్ల స్థానంలో నిర్మించిని ఇళ్లు

ప్లాట్లు ఎలాంటి నిర్మాణం చేయకుండా ఖాళీగానే ఉన్నాయి. ఇక మెకానిక్ షెడ్లు మాత్రం అద్దంకి పట్టణంలో రోడ్ల వెంబడి, ఇతర ప్రాంతాలలో నిర్వహించుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో నివాసగృహాలు, దుకాణాల నిర్వహకులు ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో రోడ్డు అంచుల్లో మెకానిక్ షెడ్లతో వాహనచోదకులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.

దీంతో ఆటోనగర్ ఏర్పాటు లక్ష్యం నీరుగారినట్లయింది. ఇప్పటికైనా ఆటోనగర్‌కు మెకానిక్‌షెడ్ తరలిపోయేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



చినగంజాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానం వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి ఆలహరి శేషతల్ప సాయి స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వినియోగం చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థానంలో 18వ తేదీ నిత్యహోమాలు, 19న స్వామి వారికి అభిషేకాలు, కల్యాణం, 20న చక్రస్నానం, భక్తులకు అన్నప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో కోదండ రామస్వామి

విద్యాప్రగతికి దాతల తోడ్పాటు అభినందనీయం

- ఎంఈవో నాగభూషణం

పంగులూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యా ప్రగతికి దాతల తోడ్పాటు అభినందనీయమని ఎంఈవో కే నాగభూషణం అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు ఎస్‌టీ ప్రాథమిక పాఠశాలలో దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు పాలపర్తి కోటయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు జయకుమార్, ప్రసన్న సమకూర్చిన నోట్ పుస్తకాలను ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల స్ఫూర్తిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం గుర్రం లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలపర్తి ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు బాచిన రాధారాణి, మాధవి, మస్తాన్‌వలి, జాకబ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దాతలు అందజేసిన పుస్తకాలతో విద్యార్థులు

అవీఇవీ

విద్యార్థి దశలోనే భవిష్యత్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉన్నప్పుడే భవిష్యత్‌లో తమకు లభించే ఉద్యోగ, వృత్తిపరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ అన్సారియా చెప్పారు. ఆ దిశగా ఉజ్వల భవిష్యత్ పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూట్ టు రైజ్ ట్రైవ్ ఫౌండేషన్, జిల్లా బాలల వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలతో పాటు పాఠ్యాంశేతర విషయాల్లోనూ విద్యార్థులు రాణించాలని చెప్పారు. ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ల స్థాయిలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ రంగాల్లో అందుబాటులో ఉండే ఉద్యోగావకాశాలను తెలియజేసేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విద్యార్థులు ఆశక్తిగా తిలకించారు. ఆయా అంశాలపై నిర్వాహకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సువర్ణ, చంద్ర మౌళీశ్వరరావు, దినేష్‌కుమార్, బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి గిరిధర్‌శర్మ, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రషీద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు ఉన్నారు.

తల్లికి వందనంపై జగన్‌రెడ్డి విమర్శలు సిగ్గుచేటు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకంపై వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి విమర్శలు సిగ్గుచేటని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మంగళవారం అన్నారు. తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి నగదు జమ అయి తల్లులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఈ పథకంపై బులుగు పార్టీ విషం చిమ్మడం దుర్మార్గమని చెప్పారు. ఇచ్చిన హామీలను వైసీపీ పాలకులు అమలు చేయకుండా ప్రజలను మోసగించారని ఎరిక్షన్‌బాబు గుర్తు చేశారు. అలాంటి వ్యక్తులు హామీలు అమలు చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. గతంలో అమ్మఒడి పథకం అమలు తీరు, ప్రస్తుత తల్లికి వందనం అమలు తీరును ప్రజలు గమనిస్తున్నారని, మీరు చెప్పే అబద్ధపు మాటలు వినే పరిస్థితిలో ఎవరూ లేరని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు చదివిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను మోసగించారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలవుతుండడాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెప్తారని ఎరిక్షన్‌బాబు అన్నారు.

కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు



కమిషనర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమణబాబును మంగళవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కమిషనర్‌కు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి శాలువతో సన్మానించారు. కమిషనర్‌ను కలిసిన వారు పట్టణ పార్టీ అధ్యక్షుడు షానే షావలి, కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రమేష్, సుబ్బారావు, షెక్షావలి, పందీటి రజిని, సంపత్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్, డానియేలు, మద్దులేటి, దస్తగిరి ఉన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని కమిషర్‌ను కోరారు.

సమస్యల పరిష్కారానికే అదాలత్



అర్జీలను స్వీకరిస్తున్న రిటైర్డు న్యాయాధికారి ఇమ్మానియేలు

కంభం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే అదాలత్, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేలు తెలిపారు. కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏబీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన మార్కాపురం డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ గృహ వినియోగదారులు, వ్యవసాయ రైతులు, మిల్లులు, ఫ్యాక్టరీలలో విద్యుత్ వినియోగించే వారికి ఏ సమస్య వచ్చినా ఇలాంటి అవగాహన సదస్సులో గాని, లేదా విజయవాడలోని గుణదలలో ఉన్న విద్యుత్ ప్రధాన కార్యాలయంలో గాని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. మంగళవారం జరిగిన అదాలత్‌లో మొత్తం 16 మంది అర్జీలు ఇవ్వగా అందులో 6 సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. 9 మంది బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, నలుగురు లోవోల్టేజ్ సమస్యలపై, ముగ్గురు మీటర్లను వేరేచోటికి మార్చాలని అర్జీలను అందచేశారు. కార్యక్రమంలో కంభం ఏడీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ నరసయ్యతోపాటు సాంకేతిక సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వర్లు, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, మార్కాపురం, యర్రగొండపాలెం ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

- పర్చూరులో రూపుదిద్దుకుంటున్న కల్యాణ మండపం

పర్చూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లో నిర్మించిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి వార్ల ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు చల్లా రోజా రావు, ప్రగతి దంపతులు బచ్చుల మునికన్నయ్య, సీతాలక్ష్మిల జ్ఞాపకార్థం రూ5లక్షల నగదును మంగళవారం అయల కమిటీ ప్రతినిధులకు అంద జేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమంలో మాజీ ఎంపీపీ కోటా హరి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లో ప్రవాసాంధ్రులు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. అనం తరం దాతలను ఘనంగా సన్మానిం చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రంగిశెట్టి ఆంజనేయులు, కఠారి సురేంద్రబాబు, తులసి శివనాగే శ్వరరావు, తులసి అప్పారావు, తులసి భువనేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, యద్దనపూడి శేషు, రంగిశెట్టి రామాంజనేయులు, తులసి నాగు, మారుతీ, సాంబయ్య పాల్గొన్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదును అందజేస్తున్న దాతలు

కష్టాలు అప్‌డేట్









-ఒంగోలు ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా తల్లికి వందనం ద్వారా స్కూళ్లకు పంపే చిన్నారులకు భారీ ఎత్తున డబ్బులు జమ చేసింది. ఈ పాటికే ఆయా బ్యాంక్‌లు, పోస్టాఫీస్‌ల వద్ద ఆ డబ్బులు డ్రాచేసేందుకు ప్రజలు క్యూ కడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ పథకంలో కొందరిని అనర్హులుగా ప్రకటించి అందుకు గల కారణాలను ప్రభుత్వం బహిర్గత పరిచింది. ఆ సమస్యలను పరిష్కరించుకుని మళ్లీ ఈ నెలాఖరులోపు దరఖాస్తులు సమర్పిస్తే తల్లికి వందనం డబ్బులు జమచేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొందరు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయించడం, ఇంకొందరు పోస్టాఫీస్‌లో ఉన్న తమ పొదుపు ఖాతాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించేందుకు అష్టకష్టాలు పడుతుండడం జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి జరుగుతున్నాయి. ఒంగోలులోని ప్రధాన తపాల కార్యాలయంలో మంగళవారం పిల్లలు, తల్లుల రాకతో విపరీతమైన రద్దీ నెలకొంది.

పట్టాదారు పాసుపుస్తకం ఇప్పిస్తామని మోసం

రూ.8 లక్షలు వసూలు చేసిన దళారులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

అద్దంకి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్ సమీపంలోని భూమికి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు రూ.8 లక్షలు వసూలు చేసిన ఘటనపై మంగళవారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలేనికి చెందిన అరిగెల అరుణ్‌బాబుకు ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 19లో పూర్వీకుల నుంచి వచ్చిన 90 సెంట్లు భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు పోవడంతో కొత్తది ఇప్పిస్తామని ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ మండలం మండలం చెరువుకొమ్ముపాలేనికి చెందిన ధనరాజుపల్లి ఆంజనేయులు, వెల్లంపల్లికి చెందిన పులిపాటి రాఘవులు పలు దఫాలుగా అరుణ్‌బాబు వద్ద రూ.8 లక్షలు తీసుకున్నారు. ఎలాంటి పాసుపుస్తకం ఇప్పించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన అరుణ్‌బాబు మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఈ సర్వేనంబర్‌లో ఉన్న భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉంది. రెవెన్యూ అధికారులు కొంతభాగాన్ని ఇటీవల విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మరి కొంత భూమి మున్సిపాలిటీ ఆధీనంలో ఉంది. మిగిలిన భూమిలో కొంత మంది నిర్మాణాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది..

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

● విజిలెన్స్ జీఎం రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతన్న విజిలెన్స్ జీఎం రామకృష్ణ

మర్రిపూడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అక్రమ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఆ శాఖ విజిలెన్స్ జీఎం రామక్రిష్ణ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. అనంతరం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వినియోగదారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు విద్యుత్ లోడుకు దరావతు సొమ్ము చెల్లించాలని ఈనెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకొని సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దర్శి ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో 1,514 సర్వీసులను 34 మంది అధికారులు 52 మంది సిబ్బంది 25 బృందాలుగా ఏర్పడి తనిఖీ చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 10 మందికి రూ.17,500, అనుమతించిన కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరీలో వాడుతున్న 11 మందికి రూ.85వేలు అనుమతికి మించి విద్యుత్ వాడుతున్న 29 మందికి రూ.57వేల చొప్పున రూ.1.59 లక్షలు జరిమానా విధించామన్నారు. దాడులలో డీపీఈ ఈఈ ఉషారాణి, డీఈ హరిబాబు, ఏఈ సుబ్బారెడ్డిలతోపాటు విజిలెన్స్ ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గాలిలో తెలుగు టీచర్

కోరుకున్న కొత్త స్కూలులో ఖాళీ లేదు

డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఒక తెలుగు గ్రేడ్-2 బాషాపండితురాలు గాలిలో ఉన్నారు. బదిలీల్లో కోరుకున్న కొత్త పాఠశాలలో విధుల్లో చేరదామని వెళ్లిన ఆ టీచర్‌కు ఖాళీ పోస్టు లేక నిరాశే ఎదురైంది. ఒంగోలు సెయింట్ థెరిస్సా ఎయిడెడ్ హైస్కూలు ప్రభుత్వంలో విలీనం కావడంతో అక్కడ పనిచేస్తున్న గ్రేడ్-2 తెలుగు భాషా పండితురాలు కొత్తపట్నం మండలం ఆలూరు జడ్పీ హైస్కూలులో నియమించారు. ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో ఆ టీచర్ బదిలీకి దరఖాస్తు చేశారు. కురిచేడు మండలంలోని ఒక హైస్కూలులో రెండు స్కూలు అసిస్టెంట్ పోస్టులుండగా.. టీచర్ల పునర్విభజనలో ఒక పోస్టు మిగులుగా తేలింది. ఆ ఒక్కరిని రేషనలైజేషన్ పేరుతో బదిలీ చేయడంతో అక్కడ పోస్టు ఖాళీ లేకుండా పోయింది. ఆ పోస్టు ఖాళీ ఉన్నట్లు బదిలీల్లో చూపించడంతో తెలుగు టీచర్ కోరుకున్నారు. తీరా విధుల్లో చేరేందుకు వెళితే పోస్టు ఖాళీ లేకపోవడంతో ఆమె ఒంగోలువచ్చి డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మిగిలిపోయిన ఖాళీల్లో ఆ టీచర్‌కు పోస్టింగ్ ఇస్తామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

గంటవానిపల్లె వాసికి డాక్టరేట్ ప్రదానం

పెద్దదోర్నాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంటవానిపల్లె గ్రామానికి చెందిన సుంకరి వెంకటసుబ్బయ్యకు ఎకనామిక్స్ విభాగంలో పప్పుధాన్యాల సాగుపై ఆరిజిథిక విశ్లేషణకు పరిశోధన చేసినందుకు ఆచార్య నాగార్జున యూనిర్సిటీ సోమవారం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. గతంలో కూడా వెంకటసుబ్బయ్య జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చి ఫెలోషిప్ పొందినట్లు చెప్పారు. తన పరిశోధనకు గైడ్‌గా యూనివర్సిటీ ప్రొఫెసర్ కే ఓబులేసు పర్యవేక్షించారని వెంకటసుబ్బయ్య చెప్పారు. విభాగాధిపతి ప్రొఫెసర్ కే మధుబాబు, డీన్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు పీహెచ్‌డీ పట్టాను అందజేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు





కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, కిలోమీటర్ దూరం వరకు ఆగిపోయిన వాహనాలు

● కిలోమీటర్ వరకు ఆగిన వాహనాలు

● ఇబ్బందిపడిన ప్రయాణికులు

ఒంగోలు(రూరల్), జూన్17(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వే ఫ్లైఓవర్ వంతెన వద్ద గల తూర్పు క్రిష్టియన్‌పాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం వల్ల భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించింది. ఆగి ఉన్న కారును వెనుక వైపు నుంచి కొత్తపట్నం బస్టాండ్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారును సుమారు 20మీటర్ల వరకు నెట్టుకు వెళ్లింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడ లేదు. అయితే సాయంత్రం 5గంటల సమయం కావటంతో పలు పాఠశాలలు బస్సులు ఒక్కసారిగా ఆ వైపునకు రావడంతో ఫ్లైఓవర్ వంతెనపై నుంచి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కొత్తపట్నం బస్టాండ్ శివాలయం దగ్గర నుంచి రైల్వే ఫ్లైఓవర్ వంతెన తూర్పు వైపు వరకు సుమారు అరగంట సేపు వాహనాలు ఇరువైపులా ఆగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏఎస్ఐ వినోద్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవరు మృతి



ట్రాక్టర్‌లో ఇరుక్కుపోయిన మహేష్ మృతదేహం

పీసీపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ఈఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని భట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామానికి చెందిన అరటివేముల మహేష్‌కు భార్య స్రవంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పీసీపల్లిలో కొత్త ఇల్లు నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఇనుపచువ్వను తెచ్చేందుకు తన సొంత ట్రాక్టర్‌తో మంగళవారం కనిగిరి వెళ్లాడు. అక్కడ ఐరన్‌ను లోడు చేయించుకున్న మహేష్ భట్టుపల్లి మీదుగా పీసీపల్లికి వస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఐరన్‌లోడుతో వస్తున్న ట్రాక్టర్ భట్టుపల్లి దాటగానే అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌ను నడుపుతున్న మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పీసీపల్లి ఎస్సై ఎక్స్‌కవేటర్ ద్వారా ట్రాక్టర్‌ను ఇంజన్‌ను వేరుచేసి ఇరుక్కుపోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టమ్ కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాపీ పని చేస్తూ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు సుపరిచితుడైన మహేష్ ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం తెలియడంతో పీసీపల్లి, తలకొండ పాడు, ముద్దపాడు, పెద్దన్నపల్లి, మర్రికుంటపల్లి, భట్టుపల్లి, బుడ్డా రెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలంతా ప్రమాదస్థలానికి చేరుకున్నారు. మహేష్ సొంతగ్రామమైన పెద్దన్నపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వయం సహాయక సంఘాలు

ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో మంగళవారం మెప్మా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 9,545 స్వయం సహాయక సంఘాలు, 326 స్లమ్ ఏరియాల్లోని సంఘాలు, ఎనిమిది పట్టణ సంఘాలు, 326 రిసోర్స్ పర్సన్స్ స్లమ్ ఫెడరేషన్, పట్టణ సమాఖ్య కింద నిధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలకోసం యాప్‌లో స్వయం సహాయక సంఘాలపై సమగ్ర సమాచారాన్ని అప్‌డేట్ చేస్తున్నట్లు ఈసందర్భంగా మెప్మా పీడీ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన రెగ్యూలర్ లైవ్లీహుడ్ యూనిట్స్ 2025-26లో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నూరుశాతం సాధించేలా కృషి చేయాలన్నారు. మార్కెటింగ్ నైపుణ్యాలలో శిక్షణ, చేయూతనిచ్చి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి మరింత పటిష్ఠంగా వ్యాపారం చేసుకొనేలా చర్యలు తీసకోవాలని చెప్పారు. సంఘాల మహిళల జీవనోపాధి కార్యకలాపాల మెరుగుకు ప్రభుత్వం విద్యుత్‌వాహనాలు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు, తృప్తి హోటళ్లు తదితర వినూత్న అవకాశాలను సభ్యులకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 20న ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమంలో సభ్యులందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

దేవదాయశాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించి వాటి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం దేవదాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. దేవాదాయ శాఖ అధికారులు అజెండాలో పొందుపర్చిన వివిధ ఆలయాల ఆస్తులను సంబంధిత తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. భూముల మ్యూటేషన్ లేదా పేరు మార్పు చేసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఈనెల 20వతేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం ఒంగోలులోని మినీస్టేడియం, పీవీఆర్ గ్రౌండ్, ఏబీఎం స్కూలు గ్రౌండ్‌ను ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ప్రత్యేక రైళ్లు మార్చి వరకు పొడిగింపు

చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో ప్రయాణికులకు ఉపశమనం



హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

20నుంచి మహిళలకు కార్ డ్రైవింగ్‌లో శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 20వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు అర్హులన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలన్నారు. శిక్షణకాలంలో భోజనం, ఉచితంగా వసతిని కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9573363141 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

లారీల్లో అధికలోడు రవాణా చేస్తే చర్యలు

● రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల

ఒంగోలు క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వాహనదారులు లారీలు, టిప్పర్లు, కంటైనర్లలో అధిక లోడుతో రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల హెచ్చరించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో లారీ, టిప్పర్లు, కంటైనర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేయవద్దని హితవు పలికారు. అదేవిధంగా ప్రజా సౌకర్యానికి భగం కలిగించే విధంగా పరిమితికి మించి గ్రానైట్ రాళ్ళు రవాణా చేయడం సరైన చర్య కాదన్నారు. గ్రానైట్ రాళ్ళు తరలించే లారీలు తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని, అధిక లోడ్‌తో రవాణా చేసినందువల్ల రోడ్లు దెబ్బ తింటున్నాయని చెప్పారు. ఇలాంటి చర్యలు విరమించుకోవాలని స్పష్టం చేశారు. మైనింగ్ డీడీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ రాయల్టీ చెల్లించకుండా గ్రానైట్ రాళ్ల రవాణా నేరమని తెలిపారు. పర్మిట్‌లు కూడా లారీ డ్రైవర్ల వద్ద అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. తనిఖీ అధికారులకు అన్ని రికార్డులు చూపించాల్సి బాధ్యత లారీ డ్రైవర్‌దే తెలిపారు. మైనింగ్ ఏడీ రామచంద్ర, ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, జయప్రకాష్, రామచంద్రరావు, సురేంద్రప్రసాద్, ఏవో శ్రీనివాసరావు, మైనింగ్ ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయండి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీకి సంబంధించి గ్రామాల క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ మండలాల పరిశీలకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, గ్రామ నూతన కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి బదిలీ నిబంధనలకు విరుద్ధం



ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావును నిబంధనలకు విరుద్ధంగా కంభం సర్కిల్‌కు బదిలీ చేయడాన్ని నిరసిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇరిగేషన్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డికిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు భిన్నంగా ఉద్యోగిని బదిలీ చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆఫీస్ బేరర్స్‌కు ప్రభుత్వం బదిలీల్లో ఇచ్చిన మినహాయింపు ఉన్నా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఎం.శ్రీనివారావు, ఏసురత్నం, కె.శ్రీనివాసులు, చంద్రశేఖర్, సుమతి, ప్రసన్న, డీవీ.శ్రీనివాసులు, చెంచారావు, అంకబాబు, సునీల్, బాబురావు, మహిళావింగ్ అధ్యక్షురాలు రజిత మానస తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



దేవరంపాడులో మాట్లాడుతున్న ఏవో రమేష్‌బాబు

ఒంగోలు(రూరల్), జూన్17(ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తామని ఏవో రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు మండలంలోని దేవరంపాడు, గుండాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల్లోపు గల రైతులు ఈకేవైసీ చేసుకోవాలని, దీనివల్ల అన్నదాత సుఖీభవ పథకం నగదు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యేదుకు ఇబ్బందులు ఉండలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య

మద్దిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని చీమకుర్తి ఎక్సైజ్ సీఐ సుకన్య హెచ్చరించారు. మంగళవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో నాటు సారా నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రానైట్ కార్మికులు గంజాయి, ఇతర డ్రగ్స్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నగేష్ మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా ఎక్కడైనా కాస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రానైట్ వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి



రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏవో సర్ణలత

మద్దిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టిందని ఏవో జి.స్వర్ణలత తెలిపారు. మంగళవారం రాచవారిపాలెం, కీర్తిపాడు, నాగన్నపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ఆమె హాజరై మాట్లాడారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి సంధ్య మాట్లాడుతూ పండ్లతోటలను సాగు చేసుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పశువుల్లో సీజనల్ వ్యాధుల రాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురాలశెట్టి నాగమల్లేశ్వరి, రావి శ్రీనివాసరావు, కాకర్ల విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు.

సీసీఆర్‌సీ కార్డు ద్వారా రుణాలు

సంతనూతలపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీసీఆర్‌సీ(పంటసాగు హక్కు పత్రం) కార్డు కలిగి ఉంటే కౌలు రైతులు ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకు నుంచి పంట రుణం పొందవచ్చని ఏవో పావని తెలిపారు. మంగళవారం మండలంలోని మంగమూరు, సంతనూతలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి గ్రామ వ్యవసాయ సహాయకుల లాగిన్లలో ఉన్న రైతుల పేర్లకు ఈకేవైసీ ఆటోమేటిక్‌గా అప్డేట్ చేసినందున రైతులు వేలిముద్రలు వేయాల్సిన లేదని తెలిపారు. పొలాలు కౌలుకు తీసుకున్న రైతులు సీసీఆర్‌సీ కార్డు పొందాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరులకేంద్రం అధికారి శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో భాస్కర్

చీమకుర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హత పొందేందుకు రైతులు వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఏవో భాస్కర్ కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని పులికొండ, బూదవాడ గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు



కొలచనకోట ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

మద్దిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలంలోని కొలచనకోట, మల్లవరం, ఇనమనమెళ్లూరు గ్రామాల్లోని గుండ్లకమ్మ నది పరివాహ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జోరుగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ రంగానికి ఊతమిచ్చేందుకు ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. గుండ్లకమ్మ నది నుంచి సులువుగా తెచ్చుకోవడానికి నిబంధనలు సడలించింది. దీతో ఇళ్ల నిర్మాణాలు పనుఊపందుకున్నాయి. ఇదే అదనుగా కొంతమంది అక్రమార్కులు దందాకు తెరలేపారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఇందుకోసం ఎక్స్‌కవేటర్లు ఉపయోగిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.2వేల నుంచి రూ.2,500 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాటం

రైతు సంఘం ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మద్దిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి తెలిపారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయకుండా చోద్యం చూస్తుందని, వ్యాపారులు సిండికేట్ అయి ధరలు కల్పించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఈ నెల 20న పొగాకు రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకౌలు రైతులు పొగాకు పంట అధికంగా సాగు చేశారని, అయితే గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వీరారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రైతులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వర రావు, చెరుకూరి వాసు, శ్రీరామ్మూర్తి, వెంకయ్య, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నగదు త్వరలో రైతుల ఖాతాల్లో జమ

● ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రూ.7వేల నగదును ప్రభుత్వం త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని ఏవో పోతినేని వెంకట్రావు సూచించారు. మండలంలోని చదలవాడ, మద్దిరాలపాడు గ్రామాల్లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతుల జాబితా ఈ నెల 19న అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతులు త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునేందుకు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జాస్మిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పొన్నలూరు: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రాము సూచించారు. పొన్నలూరులోని సచివాలయంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రాము మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు 80 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 50 శాతం రాయితీతో కిలో 54.50 రూపాయలకే ఇస్తున్నామని, విత్తనాలు కావాల్సినవారు రైతుసేవా కేంద్రాల్లో తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ఈనెల 19వ తేదీలోపు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

జూదరుల అరెస్ట్

పొన్నలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాలపాడు వద్ద మంగళవారం తెల్లవారుజామున పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 16,540 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అనుక్ తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు 'తల్లికివందనం'వర్తింపజేయాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

చీమకుర్తి, జూన్17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తల్లికివందనంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ నాయకులు, కార్మికులు చీమకుర్తిలో కమిషనర్ వై.రామకృష్ణయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పూసపాటి వెంకట్రావు, ఏడుకొండలు, పద్మ, నరసయ్య, విక్టర్‌పాల్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నల్లబర్లీ పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతు సంఘం జిలల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం నాగులుప్పలపాడులో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడితో ఈ ఏడాది అధికంగా సాగు చేశారని, రైతులను ప్రోత్సహించిన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు చేతులెత్తేశారని చెప్పారు. దీంతో బర్లీ సాగుచేసిన రైతులు అప్పులపాలయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని కోరారు.

హెల్త్ సెంటర్ కోసం గది పరిశీలన



పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సృజన

పొన్నలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు గ్రామ బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రాథమిక హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నట్టు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సృజన తెలిపారు. ప్రాథమిక వైద్యశాల గ్రామానికి దూరంగా ఉన్నందువల్ల, అత్యవసర సమయాల్లో ప్రజలకు ఉపయోగపడేలా బస్టాండ్ వద్ద హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేయాలని ఇటీవల గ్రామస్థులు మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి విజ్ఞప్తిచేశారు. ఈనేపథ్యంలో మంత్రి ఆదేశాలతో వైద్యశాఖ అధికారులు, గ్రంథాలయం పక్కన గదిని మంగళవారం పరిశీలించారు. రూముకు రిపేర్లు చేయిస్తే, హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేస్తామని సృజన తెలిపారు.

ఘనంగా కమలాకర్‌రెడ్డి జయంతి



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి కుటుంబసభ్యులు

చీమకుర్తి, జూన్17(ఆంధ్రజ్యోతి) : సినీనటుడు బూచేపల్లి కమలాకర్ రెడ్డి జయంతి వేడుకలు చీమకుర్తిలో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక కమలాకర్‌రెడ్డి పార్కులో జరిగిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని, కుటుంబసభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

22న పూర్వ విప్లవ విద్యార్థి సంఘం సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 22వతేదీన ఆంధ్రప్రదేశ్ పూర్వ విప్లవ విద్యార్థి సంఘం(ఆర్‌ఎస్‌యూ) సమావేశం జరుగుతుందని పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు తెలిపారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వై.రాజశేఖర్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, ఎ.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఒంగోలు(రూరల్), జూన్17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులను చేర్పించాలని సూపర్‌వైజర్ కె.రమ పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తామన్నారు. అలాగే పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.శేషమ్మ, ప్రసూనదేవి, సుకృత, వెంకాయమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్ద దోర్నాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న కారును మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నల్లమల రెస్టారెంట్ వద్ద మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నారుట్ల గ్రామానికి చెందిన భూమని శాంసన్, కుడుముల వెంకటేశం, కుడుముల బయన్నకు గాయాలయ్యాయి. భూమని శాంసన్, వెంకటేశం, బయన్న చిన్నారుట్ల నుంచి మోటార్‌సైకిల్‌పై ఎర్రగొండపాలెం వెళ్తుండగా నల్లమల రెస్టారెంట్ వద్ద ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. రోడ్డుపై పడడంతో వారు గాయపడగా గమనించిన కొందరు ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి

● పాఠశాల విద్యా కమిషనర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ఈనెల 18నుంచి మూడు రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం ఒక గంట పాటు యోగాసనాలు సాధన చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు యోగాసనాలపై దిశా నిర్దేశం చేశారు. ఆయా అంశాలపై మండల ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి యోగా కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు చిరంజీవి, బీమ్‌నాథ్, చంద్రమౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి 93శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు మంగళవారం 93శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 1271 మందిని కేటాయించగా 1186 మంది హాజరయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 896 మందికి 851, మధ్యాహ్నం సెషన్‌కు 375 మందికి 335 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన థల్ సైనిక్ క్యాంపులకు ఎంపికై సత్తా చాటారు. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.విజయ్, అభిషేక్ చీరాలలో జరిగిన ఎన్‌సీసీ క్యాంపులో ప్రతిభ చాటి వచ్చేనెల 12న అనంతపురంలో జరగనున్న థల్ సైనిక్ క్యాంపులో పాల్గొనున్నారు. అలాగే ఈనెల 8నుంచి 17వ తేదీ వరకు జరిగిన మాన్యువల్ శిక్షణ క్యాంపులో కూడా కళాశాల క్యాడెట్లు తమ ప్రతిభను చాటారు. ఫైరింగ్ విభాగంలో బాలికలు జి.వైష్ణవి, జాస్రిన్, బాలుర విభాగంలో ఆర్.సురేంద్ర, లక్ష్మీనారాయణలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. టెంట్ ఫిక్సింగ్‌లో సీనియర్ డివిజన్ క్యాడెట్లు మొదటి బహుమతి సాధించారు. డ్రిల్‌లో కూడా ఎన్‌సీసీ క్యాడెట్లు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, హెచ్‌వోడీ శ్రీనివాసరావు, సీహెచ్.హిమబిందు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

నీట్‌లో నారాయణ విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను సత్కరించిన ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు నీట్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఈక్రమంలో కె.హర్షిణి 4,341, ఎం.సాయి విజయ, చైతన్య 4,996 ర్యాంకు సాధించారు. అన్ని కేటగిరిల్లో ఏడుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించి మెడికల్ విద్యను అభ్యసించేందుకు అర్హత సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు ర్యాంకులు సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కాగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఒంగోలులో డీన్ మధుసూదన్‌రెడ్డితోపాటు ఏజీఎం మురళీ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఎన్.సుజాత ప్రత్యేకంగా అభినందించారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలి

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని విద్యా సంస్థలు ఎటువంటి అనుమతులు లేకుండా స్కూళ్లను నిర్వహిస్తూ అడ్డుగోలుగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. అనుమతులు లేకపోయినా అధికారుల అండదండలతో పాఠశాలలు నిర్వహిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి పాఠశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు తల్లికివందనం పథకం అమలు చేయడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అవినాష్, ఉపాధ్యక్షుడు వర్షిత్, గోపి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ సమావేశానికి మాగుంట హాజరు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మంగళవారం జరిగిన ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ కేసీ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులతో పాటు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాగుంట పలు అంశాలపై మాట్లాడారు.

హమాలీల సమ్మె నోటీసు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల 9న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం ఒంగోలులో సమ్మె నోటీసును సివిల్ సప్లయీస్ డీఎం వరలక్ష్మికి పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు కనీసవేతనాన్ని రూ.26వేలు ఇవ్వాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రతి ఐదేళ్ళకు ఒకసారి షెడ్యూల్ ఎంప్లాయీస్‌లో వేతన సవరణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నాయకులు భక్తుల గోపాలరావు, సంజీవరావు, వెంకట్రావు, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి

ఒంగోలు(రూరల్), జూన్17(ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని వామపక్ష నాయకలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ దగ్గర నుంచి అద్దంకి బస్టాండు వరకు వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్య విస్తరణ కోసం ప్రపంచ దేశాలపై యుద్ధాలను రుద్దుతోందని, దీంతో అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. గాజాపై చేస్తున్న యుద్ధాని ఆపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలను భారత్ ఖండిచాలని డిమాడ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జి.రమేష్, ఎంఎస్.సాయి, కాలం సుబ్బారావు, ఎం.సుబ్బారావు, చొప్పర సాగర్, వి.బాలకోటయ్య, బి.రఘురాం, అమీర్, కంకణాల రమాదేవి, బంకా సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, పద్మ, పి.సుబ్బారావు, ఎం.నారాయణరావు, ఆర్.మోహన్, నాంచార్లు, కంకణాల ఆంజనేయులు, పాల్గొన్నారు.

సర్వేలకే పరిమితమైన నూతన లైన్లు

నిర్మాణానికి నిధులు ఇవ్వని రైల్వే శాఖ

గిద్దలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల నుంచి ఆదాయాన్ని దండుకుంటున్న రైల్వేశాఖ వారికి మాత్రం మెరుగైన సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. గిద్దలూరు నుంచి భాకరాపేటకు, కంభం నుంచి పొద్దుటూరుకు కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖ సర్వే పనులను చేపట్టింది. సర్వే పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బడ్జెట్‌లో మాత్రం ఈ రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు చేయడం లేదు. ప్రతి బడ్జెట్‌లో ఈ రెండు రైల్వేలైన్ల నిర్మాణ సర్వేకు అంతో ఇంతో కేటాయిస్తున్నారే తప్ప నిర్మాణ పనులు మాత్రం మొదలు పెట్టడం లేదు. గిద్దలూరు నుంచి భాకరాపేటకు కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపడితే గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు, సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ, కడప జిల్లాలోని కలసపాడు, పోరుమామిళ్ళ, బద్వేలుకు రైల్వే సౌకర్యం ఏర్పడుతుంది. దానికితోడు తిరుపతి వెళ్లేందుకు దగ్గరి దారిగా కూడా ఉంటుంది. సుమారు 150 కిలోమీటర్ల మేర ఉండే గిద్దలూరు-భాకరాపేట నిర్మాణం పూర్తయితే కడప, ప్రకాశం జిల్లాల ప్రయాణికులకు ఎంతో వెసలుబాటు కలుగుతుంది. ఈ ప్రాంతంలోని ఏ ఒక్క గ్రామానికి, పట్టణానికి ప్రస్తుతం రైల్వే సౌకర్యం లేదు కావున సౌకర్యం వచ్చినట్లు అవుతుంది. సర్వే పూర్తి అయి ఐదారేళ్లు అయినా ఇంకా సమగ్ర సర్వే అంటూ మీనమేషాలు లెక్కిస్తున్నది. అలాగే కంభం నుంచి పొద్దుటూరుకు కూడా కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ఇప్పటికే సర్వే దాదాపు పూర్తయింది. నిధుల సమస్య గురించి రైల్వే శాఖ ప్రస్తావించిన సందర్భంలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించేందుకు కూడా ప్రతిపాదనలు జరిగాయి. కంభం-పొద్దుటూరు మధ్య 142 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మించాల్సి ఉండగా, బేస్తవారపేట, కొమరోలు మండలాల్లోని, అలాగే కడప జిల్లా పోరుమామిళ్ల ప్రాంతవాసులకు కొత్తగా రైలు సౌకర్యం లభిస్తుంది. ఈ రెండు పట్టణాల మధ్య సుమారు 15 రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. కానీ రైల్వేశాఖ మాత్రం దక్షిణాదిపై చిన్నచూపు చూస్తుండగా ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంపై ఇంకా చిన్నచూపు చూస్తున్నది. ఈ రెండు కొత్త రైల్వేలైన్ల నిర్మాణం జరిగితే గిద్దలూరు, కంభం రైల్వేస్టేషన్లు జంక్షన్లుగా మారి మరింత అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాంతవాసులకు కడప, చిత్తూరు జిల్లాలకు వెళ్లాలంటే 30 నుంచి 50 కిలోమీటర్ల దూరం తగ్గడమే కాకుండా సౌలభ్యంగా కూడా ఉంటుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ రెండు కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి నిధులు మంజూరు చేపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గిద్దలూరు రైల్వే స్టేషన్



సీతారాముల ఉత్సవ విగ్రహాలు

వైభవంగా సీతారాముల కల్యాణం

తర్లుపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లెలోని పట్టాభిరామ స్వామి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఓరుగంటి పవన్ కుమార్, ఓరుగంటి శర్మ స్వామివారికి గణపతి పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల విగ్రహాలను కల్యాణ మండపం పైకి తీసుకొచ్చి మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ, కమనీయంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు జై శ్రీరామ్, జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివారికి బుధవారం సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేసవి పత్తికి అనుకూలించిన వర్షాలు

కాపునకు వచ్చిన వేసవి పత్తి

ఎర్రగొండపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్‌లో గ్రామాల్లో సాగు చేసిన వేసవి పత్తికి ఈ సంవత్సరం మే, జూన్‌లో కురిసన వర్షాలు దోహదపడ్డాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్‌లో బీటీ పత్తి విత్తనాలను విత్తారు. డీప్ బోర్లలో వచ్చే కొద్దిపాటి నీరుతో తొలి వేసవి పత్తి సాగు చేశారు. వేసవిలో సాగు చేసే పత్తికి విత్తనాలు విత్తుకునేందుకు బోరు నుంచి వచ్చే నీరు చాలా అవసరం ఉంటుంది. అయినప్పటికీ రైతులు డ్రిప్ సిస్టమ్ ద్వారా నీరు సరఫరా చేసి వేసవిలో బీటీ పత్తి పైరు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ సాగుచేసే పత్తి పైరు కంటే వేసవిలో సాగు చేసిన పత్తి పైరుకు చీడపీడలు క్రిమికీటకాలు ఆశించక పోవడంతో పెట్టుబడి ఖర్చులు తక్కువని రైతులు వేసవి ఎంతకష్టమైనా బోర్లలో కొద్దిపాటి నీరు వచ్చే రైతులు వేసవి పత్తి సాగు చేసి రైతులు పంట దిగుబడులు పొందుతున్నారు. ఈ ఏడాది అల్పపీడనం కారణంగా మే, జూన్‌లో కురిసిన అకాల వర్షాలు పత్తి పైరుతో పాటు పండ్ల తోటలకు దోహదపడ్డాయి. మండలంలో 400 హెక్టార్లు, పుల్లలచెరువు మండలంలో 300 హెక్టార్లు, త్రిపురాంతకం మండలంలో 100 హెక్టార్లలో దోర్నాల మండలంలో 50 ఎకరాలలో వేసవి పత్తి పైరు రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పైరు ఏపుగా పెరిగి పూతకువచ్చే దశలో ఉన్నాయని రైతులు తెలిపారు. ఎర్రగొండపాలెం, వైకొత్తపల్లి, పందివానిపల్లి, గోళ్లవీడపి, వాదంపల్లి, గంజివారిపల్లె, కొలుకుల, గంగుపల్లి, వీరభద్రాపురం గ్రామాల్లో వేసవి పత్తి పైరు సాగు చేశారు.



ఏపుగా పెరిగిన పత్తి

అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ

కొమరోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ నగదు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారని గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోడి ఓబుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇడమకల్లు, రాజుపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో రాజశ్రీ, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ మోహన్‌కృష్ణ, ఏఈవో కౌసర్, ఎంపీవీ ప్రసాద్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రైతులు పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయడం వలన భూములు సారవంతంగా తయారవుతాయని వ్యవసాయాదికారి కే బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని బోడపాడు, దరిమడుగు గ్రామాలలో ఏవో బుజ్జిబాయి అధికారులు, రైతులతో కలిసి మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి పలు సలహాలు సూచనలు తెలియజేశారు. దరిమడుగు గ్రామ సచివాలయం వద భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయిరామ్, పావనీశ్వరి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : పత్తిలో పచ్చదోమ నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో సాగు చేసిన పత్తి పైరును పరిశీలించారు. పైరుపై పచ్చదోమను గుర్తించారు. సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో జయప్రకాశరావు, వీహెచ్‌ఏ మల్లునాయక్, పట్టు పరిశ్రమ టీఏ నాగరాజు నాయక్, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారి జ్యోత్స్నదేవిక అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు, ఓబాయపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బుర్రయ్య, మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ అవసరం లేదు

పొదిలి : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు పథకాల అర్హులు ప్రస్తుతం ఈకేవైసీ చేయాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఈగలపాడులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కంభం : భూసారాన్ని మెరుగు పరిచే విధంగా రైతులు పచ్చిరొట్ట పంటలు (పచ్చి ఎరువుల పంటలు) సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి మహమ్మద్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తురిమెళ్ల, మదారుపల్లిలో రైతులతో కలిసి నిర్వహించి, పత్తి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

పెద్దారవీడు : రైతులు మంచి విత్తనాలను ఎంపిక చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఏవో ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.ఆదిలక్ష్మి, కె.లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాలలో ఏవో నీరజ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పంటను ఆర్‌సికే సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలని ఏవో సూచించారు.



భూ సార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు అందజేస్తున్న ఏవో, టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

విద్యార్థులలో అవగాహన పెంచాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వివిధ సైబర్ నేరాలు, మంచి, చెడు విషయాలపై ప్రధానోపాధ్యాయులు విద్యార్థులలో అవగాహన పెంచాలని సీఐ సుబ్బారావు అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్న వివిధ మోసాలు, చెడు మార్గాలపై నిత్యం జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్‌ల ద్వారా అనేక మోసాలు జరుగుతున్నాయని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి, చెడు విశ్లేషణ కలిగి మోసగించే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రలోభాలకు లొంగి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.శర్వాణి, బి.రామ్‌దాస్ నాయక్, ప్రధానోపాధ్యాయులు శ్యామ్ సుభాకర్, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పట్టణ, రూరల్ ఎస్ఐలు పాల్గొన్నారు.

ధర్తి ఆబ జన్‌భగీదరి అభియాన్‌తో గిరిజనులకు వెలుగులు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన దర్తి ఆబ జన్ భగీదరి అభియాన్‌తో చెంచు గిరిజనుల జీవితాల్లో వెలుగులు ప్రసరించనున్నాయని తహసీల్దారు సీహెచ్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గ్రామాల్లో దర్తి ఆబ భగీదరీ అభియాన్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక వసతులు ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించడం, అంతర్గత రహదారులు నిర్మాణాలు చేపట్టడంతో పాటు వ్యక్తిగతంగా అవసరమైన రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పింఛన్ తదితరవి మంజూరు చేసి, జీవన స్థితిగతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. సంబంధిత శాఖల అధికారులకు సహకరించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కమలా కుమారి, హౌసింగ్ ఏఈ శివ శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్, వ్యవసాయ శాఖాధికారి చైతన్యకుమార్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏ షేక్ లాల్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, వీఆర్వో వెంకటయ్య పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : గిరిజన గూడాలలో చెంచులకు మెరుగైన వసతులను కల్పించేందుకే దర్తి ఆబ భగీదరి అభియాన్ కార్యక్రమాలను చేపట్టినట్లు ఐటీడీఏ అసిస్టెంట్ పీవో సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దద్దనాల, అల్లిపాలెం, అమానిగుడిపాడు చెంచుల గూడాలలో పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో, ఏటీడబ్ల్యూవో, ఏఎస్‌వో, రెవెన్యూ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఉపాధి, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష విలువైన విద్యా సామగ్రి అందజేత



విద్యా సామగ్రిని అందజేస్తున్న దాతలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో గూటూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1250 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువ చేసే విద్యా సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూటూరి ఫౌండేషన్ ప్రతినిధి నాగరాజు, సుజాతలు మాట్లాడుతూ.. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో విద్యకు ఎవరూ దూరం కాకూడదనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాలలో అడ్మిషన్లు

గిద్దలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గల మానసిక దివ్యాంగులు, బధిరుల పిల్లలకు ప్రత్యేక పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులు మానసిక రుగ్మతలతో ఉన్న వారు, బధిరుల పిల్లలు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. 6 నుంచి 20 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారికి ప్రత్యేక శిక్షణ, హాస్టల్ వసతి, ఉచిత భోజనం కల్పిస్తామని, వివరాలకు 9491520653 సంప్రదించాలని కోరారు.



షబ్బీర్‌బాషా రాగ అనూష జుబీనా

నీట్‌లో జ్ఞానశ్రీ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్షా ఫలితాలలో జ్ఞానశ్రీ నీట్, ట్రిపుల్ ఐటీ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎం.మల్లికార్జునరావు మంగళవారం విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. డి.షబ్బీర్ బాషా 510, రాగ అక్షయ 500, జుబీనా 494 మార్కులు సాధించారని తెలిపారు. సుబ్రహ్మణ్యం 340, అంజలి 325, దయానా 335, సుమ 313 మార్కులు సాధించారని తెలిపారు.



సిద్ధిభైరవేశ్వర ఆలయ నూతన కమిటీ

రాచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో సిద్ధి భైరవేశ్వర ఆలయ పాత కమిటీని రద్దు చేసి మెజారిటీ సభ్యుల తీర్మానంతో కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మదిరె గుండారెడ్డి, అన్నపురెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాత కమిటీ నేటికీ సమావేశాలు నింర్వహించక పోగా రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు నిర్వహించలేదన్నారు. కమిటీలో సభ్యులు కొందరు మరణించగా కమిటీ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయలేదన్నారు. ఆలయానికి సంబంధించి ఎలాంటి ఆదాయ వివరాలు లేవన్నారు. దీంతో కొత్త కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా మదిరె గూండారెడ్డి, కార్యదర్శిగా అన్నపురెడ్డి రామనారాయణరెడ్డితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి

బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

రాచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని గిద్దలూరు టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. రాచర్ల, గౌతవరం గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సహకారంతో మంగళవారం ఆయన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు లేకపోతే జీవితం లేదని, చదువుతోనే జీవితం అని అన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ముగ్గురు దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన వీల్‌ఛైర్, స్టాండ్‌లను అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, హెచ్‌ఎం టీఎల్ రామానాయక్, టీడీపీ నాయకులు యోగానంద్, జీవనేశ్వర్‌రెడ్డి, సనావుల్లాఖాన్, చక్రియాదవ్, కిరన్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొతురాజుపెంట చెంచుగూడెంలో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో చెంచులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ డైరక్టర్ టీ రామారావు మాట్లాడుతూ వర్షం నీటిని వృథా చేయరాదని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం సంస్థ కృషి చేస్తుందన్నారు. ఎంఈవో పీ ఆంజనేయులు పాల్గొని తల్లికి వందనం పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సిబ్బంది, ఉపాధి హామి సిబ్బంది, చెంచులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి అన్నారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికుల వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఈనెల 20న సమ్మెలోకి వెళతామని, సమ్మె నోటీసు బుధవారం కమిషనర్ నారాయణరావుకు అందించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్, రమణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారిగా శేఖర్



శేఖర్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

పొదిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారిగా రాచర్ల శేఖర్, మహిళ కమిటీ అధ్యక్షులుగా సామంతపూడి విజయలక్ష్మి నియమితులైనట్లు జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అందరినీ కలుపుకుంటూ విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. నమ్మకంతో ఇంతటి పెద్ద భాధ్యతను అప్పగిచిన శ్రీనివాసాచారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదువులు పొందిన వారిని మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుత్తికొండ కల్యాణ్, బాబు, నిమ్మల సూర్యం, సామంతపూడి బాలసుబ్రమణ్యం ఉన్నారు.

ఇన్‌చార్జి ఏంపీడీవోగా చెన్నారావు

కొమరోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జక్కం చెన్నారావు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న సయ్యద్ మస్తాన్ వ్యక్తిగత పనులపై సెలవులో ఉండటంతో పరిపాలనా దృష్ట్యా కొమరోలు విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న చెన్నారావుకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. చెన్నారావు గిద్దలూరులో విస్తరణాధికారిగా పనిచేసి బదిలీపై కొమరోలు విస్తరణాధికారిగా వచ్చారు. చెన్నారావు కొమరోలు మండలంలో పంచాయతీ కార్యాదర్శిగా పనిచేసిన అనుభవం ఉంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్ద దోర్నాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న కారును మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నల్లమల రెస్టారెంట్ వద్ద మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నారుట్ల గ్రామానికి చెందిన భూమని శాంసన్, కుడుముల వెంకటేశం, కుడుముల బయన్నకు గాయాలయ్యాయి. భూమని శాంసన్, వెంకటేశం, బయన్న చిన్నారుట్ల నుంచి మోటారు సైకిలుపై ఎర్రగొండపాలెం వెళ్తుండగా నల్లమల రెస్టారెంట్ వద్ద ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. రోడ్డుపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన కొందరు ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మనస్తాపంతో పురుగుమందు తాగిన యువకుడు

కంభం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసుస్టేషన్‌లో తనకు న్యాయం జరుగలేదన్న మనస్తాపంతో ఓ యువకుడు పురుగుమందు తాగిన ఘటన కంభం మండలం రావిపాడు గ్రామంలో జరిగింది. ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. రావిపాడు గ్రామానికి చెందిన అభిషేక్‌రెడ్డి కంచు రవికుమార్ వద్ద రూ.5వేల నగదు తీసుకుని ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అభిషేక్‌రెడ్డి రవికుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రవికుమార్‌ను విచారించారు. ఈనేపథ్యంలో రవికుమార్ తన తప్పులేదని, మీరే నాకు న్యాయం చేయాలని, అభిషేక్‌రెడ్డి నుంచి డబ్బులు ఇప్పించాలని కోరాడు. అయితే పోలీసులు తనకు న్యాయం చేయలేదని మనస్తాపంతో పురుగు మందు తాగడంతో కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా టీడీపీకి చెందిన మాకు ఎటువంటి న్యాయం జరుగకపోవడంపై రవికుమార్ కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పశువైద్యాధికారిగా నాగమణి బాధ్యతల స్వీకరణ

రాచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుమలవీడు పశువైద్యాధికారిగా పి.నాగమణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె దర్శి మండలం రాజంపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ వీవీ సాయిచక్రవర్తి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

- ముందుకు కదలని మురుగు
- వర్షం పడితే రోడ్లపైకి చేరుతున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో మురుగునీరు ముందుకు కదలడంలేదు. వర్షం పడినప్పుడు నీరంతా రోడ్లపైకి చేరుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పట్టణంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పంచాయతీ అధికారులు తొలగించారు.



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



చిన్నపాటి వర్షానికే రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాలువలపై ఉన్న స్లాబ్‌లను ఎక్స్‌కవేటర్లతో పగులకొట్టారు. వ్యర్థాలన్నీ కాలువల్లో పడిపోవడంతో మురుగునీరు ముందుకు కదలక సమస్యలు తలెత్తుతున్నాయి.

పట్టణంలో యథేచ్ఛగా కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఈక్రమంలో పంచాయతీ అధికారులు కాలువలపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. కాలువలపై ఉన్న స్లాబులు పగులకొట్టారు. దీంతో రాళ్లు, చెత్తాచెదారాలు కాలువల్లో పడిపోయాయి. వీటిని తొలగించకపోవడంతో మురుగునీరు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతుంది. ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి మురికినీరు రోడ్లపైకి చేరింది. స్థానిక పాత స్టేట్ బ్యాంకు రోడ్డుపై మురుగునీరు ప్రవహించింది. కనిగిరి రోడ్డు కాలువల్లో చెత్తాచెదారం అడ్డుగా నిలబడిపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో పంచాయతీ అధికారులు కాలువలు పగులకొట్టి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇటీవల పట్టణంలో మెయిన్ రోడ్డు అయిన కనిగిరి రోడ్డు నుంచి నెల్లూరు రోడ్డు, కందుకూరు రోడ్డు వరకు సైడు కాలువలు పగులకొట్టారు. దాంతో వ్యాపారస్తులు దుకాణాలముందు రాకపోకలకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈక్రమంలో కొనుగోలుదారులు కాలువలు దాటుతున్న సమయంలో అదుపుతప్పి కాలువల్లో పడిపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులతో పాటు కాలువల్లో అడ్డుగా పడిఉన్న రాళ్లు, వ్యర్థాలను తొలగించి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

దర్శి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంగళవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు లలిత్‌సాగర్ తెలిపారు. దర్శి పట్టణం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినందున లోఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. దర్శి పట్టణంలో అనేకచోట్ల కరెంట్ తీగలు ప్రమాదభరితంగా మారాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై స్పందించిన పుల్లారెడ్డి వెంటనే పాతస్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు, విద్యుత్ తీగలు ఏర్పాటుచేసే విధంగా అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. కురిచేడు మండలం కల్లూరులో విద్యుత్ సబ్ స్టేషన్ పనులు వేగవంతంగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలోని అనీ రకాల విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు డాక్టర్ లలిత్‌సాగర్ తెలిపారు.



పుల్లారెడ్డిని కలిసిన డాక్టర్ లలిత్‌సాగర్

నేరాల నియంత్రణకే పోలీసుల పల్లె నిద్ర

- డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

వెలిగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు పల్లె నిద్ర చేస్తున్నారని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని తమ్మినేనిపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, డెబిట్ కార్డుల నెంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. గ్రామాలకు అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణపావని, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దొనకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పలు పాఠశాలల్లోని విద్యార్థులకు గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై ఎస్‌ఐ త్యాగరాజు అవగాహన కల్పిస్తున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు జడ్పీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, స్వీయరక్షణ, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో జరిగే మోసాలు, చట్టాలపై అవగాహనకల్పించారు. ఏదైనా అత్యవసరమైన సమయంలో పోలీసుల సహాయం పొందాలంటే 100 కాల్ చేయటం ద్వారా సత్వర సహాయం అందుతుందని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ త్యాగరాజు

బాలల చట్టాలపై అవగాహన కల్పించాలి

తాళ్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జునరావు ఆధ్వర్యం లో మహిళా పోలీసులకు బాలలహక్కుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సాగర్ మాట్లాడుతూ ఐసీడీఎస్, పోలీస్ వ్యవస్థలు సమన్వయంతో బాల్యవివాహాలను అరికట్టాలన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

ఉపాధి కల్పనే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా

కనిగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కలించటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజాయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎస్‌ఎం (జీసీఅండ్‌వైపీఎస్) కళాశాలలో జరిగిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జాబ్‌మేళాలో కల్పించే ఉపాధి, ఉద్యోగావకాశాలు పొంది ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్ డి.రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, యువతీ, యువకులు పాల్గొన్నారు. మంగళవారం 14 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 142మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వారిలో 63 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దక్కాయి. వారికి కళాశాల యాజమాన్యం అధ్వర్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు.

అధ్వానంగా పెద్దగుడిపాడు రహదారి

- వర్షం కురిస్తే రాకపోకలకు ఇబ్బందులు

దొనకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెద్దగుడిపాడు గ్రామంలోని ప్రధాన రహదారి బురదమయమైంది. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు రహదారి బురదమయంగా మారుతుండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోని ప్రజలు వీధుల్లోకి రావాలంటే ఎక్కడ కాలుజారి పడిపోతామోనని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. చినుకుపడితే చాలు రహదారి చిత్తడిగా మారటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కురిసిన కొద్దిరోజులు ఈరహదారిపై అడుగు తీసి అడుగు వేయాలంటే ఇబ్బందిగా ఉంటుంది. దీనికితోడు దోమలకు ఆవాసంగా మారడంతో రాత్రిళ్ల జాగారం చేయాల్సి వస్తుందని సమీప నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకుతోడు దోమకాటుతో ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకొని ప్రధాన రహదారిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ ఇబ్బందులను తొలగించాలని పెద్దగుడిపాడు గ్రామస్థులు కోరుతున్నారు.



బురదమయమైన పెద్దగుడిపాడు రహదారి

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏవో టి.అబ్రహం లింకన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దూబగుంట, నుచ్చుపొద గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వం అందించే పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అవినాష్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు అన్నారు. మంగళవారం మండంలోని కంభాలదిన్నె, తూర్పుకోడిగుడ్లపాడు, పామూరు గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి వచ్చిన అర్జీలపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినా, అనుమతులు లేకుండా లేఔట్లు వేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.అజయ్‌కుమార్, మండల సర్వేయర్ స్వప్న, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేటినుంచి అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపురం, కమ్మవారిపలెం గ్రామాల సరిహద్దులో వెలసియున్న శ్రీఅచ్చమాంబ పేరంటాలు దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 22 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమ, గురువారం ఉదయం గణపతి పూజ, హోమాలు, సాయంత్రం గ్రామ ఉత్సవం జరుగుతుందని తెలిపారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, విశేషపూజలతో పాటు గ్రామ ఉత్సవం, శనివారం అమ్మవారి శాంతి కల్యాణం, సాయంత్రం కుంకుమార్చన పూజలు, జరుగుతాయని పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సీఎస్‌పురం ఏవోగా మధుబాబు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం వ్యవసాయాధికారిగా బి.మధుబాబు నియమితులయ్యారు. ఆయన కురిచేడు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన బి.సంపత్‌కుమార్ కురిచేడుకు బదిలీ అయ్యారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని వ్యసాయ కార్మికసంఘం నాయకుడు కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బుక్కాపురంలో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశాలను సందర్శించారు. ఈసందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోతే కూలీలు తమ కుటుంబ పోషణ ఎలా పోషించుకుంటారని మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాటా వీర నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

వెలిగండ్ల, జూన్ 17: (ఆంధ్రజ్యోతి) వెలిగండ్ల మండలం కంకణంపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెబోయిన రమణయ్య మంగళవారం పాఠశాలలో చదువుతున్న 45 మంది విద్యార్థులకు సొంత నిధులతో నోటుపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, సర్పు వెంకటేశ్వర్లు, శాంతి, నాయకులు కృష్ణారెడ్డి, సర్పంచ్ ఆనందయ్య, అద్దంకి నారయణ, రెడా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

వెలిగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకణంపాడు, వెలిగండ్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీఏ వెంకటరమణ మాట్లాడుతూ కౌలు రైతులు పంటసాగు హక్కుపత్రాలను తీసుకోవాలన్నారు. అనంతరం పొలాల్లో మట్టి నమూన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చిలకుల వెంకటేశ్వర్లు, చౌడారెడ్డి, షేక్ అజరుద్దీన్, ఎం.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సాగును లాభసాటిగా మార్చుకోవాలి

తాళ్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాగును లాభసాటిగా మార్చుకునేందుకు ప్రతిరైతు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏవో ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని శివరాంపురం, మల్కాపురం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులనుబట్టి స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రకాల పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాలను పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో జైనులాబ్దిన్

వ్యవసాయంలో లాభసాటి పద్ధతులు పాటించాలి

కనిగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో లాభసాటి పద్ధతులు పాటించాలని ఏవో జైనులాబ్దిన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గురవాజీపేటలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు కార్డులు పొంది ప్రభుత్వం అందించే లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతి ద్వారా రైతులకు కావాల్సిన పనిముట్లను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఉద్యాన అధికారి విష్ణుప్రియ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్‌లను 90శాతం రాయితీతో ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న పశువైద్యాధికారులకు సన్మానం

పామూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న పశువైద్యాధికారులను ఘనంగా సన్మానించారు. పామూరు పశువైద్యాధికారిగా పనిచేస్తున్న ఈమనిశ్రీసాయి నెల్లూరు జిల్లా కొడేడు మండలానికి బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో వెలిగండ్ల మండల పశువైద్యాధికారి ఆర్.హనుమాన్ సాహెబ్ నియమితులయ్యారు. సీఎస్‌పురం మండలం నల్లమడుగులలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసులు కనిగిరి మండలం బల్లిపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం మరుపూరులో పనిచేస్తున్న పశువైద్యాధికారి నియమితులయ్యారు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బదిలీపై వెళుతున్న, బదిలీపై వచ్చిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ ఆర్.రమేష్, సీఎస్‌పురం పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్నభోజన ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న మీరామొహిద్దీన్, శంషాద్ బేగం

తాళ్లూరు, జూన్17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం సమయంలో ప్లేట్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో విద్యాకమిటీ ఛైర్మన్ షేక్ శంషాద్ బేగం విద్యార్థులకు వంద ప్లేట్లు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. మధ్యాహ్నభోజన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్లేట్లు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మీరామొహిద్దీన్, అన్వర్‌బాషా, షేక్ జిలాలుద్దీన్, హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

తాళ్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బాపట్ల నారాయణ బొద్దికూరపాడు గ్రామంలో మంగళవారం దొండ్లపాటి వెంకటేశ్వర్లుకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. వెంకటేశ్వర్లుకు భార్య గురవమ్మ బ్యాంక్ ఖాతాదారులై మృతి చెందటంతో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో నమోదు కావటంతో బీమా నగదు అందజేశారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ నారాయణ మాట్లాడుతూ ఖాతాదారులు బీమా నమోదు చేయించుకోవాలన్నారు. ఆపద సమయంలో కుటుంబాలకు బీమా నగదు తోడ్పాటునందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఎన్.అంజిరెడ్డి , బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనతో దేశాభివృద్ధి



మాట్లాడుతున్న కేవీ రమణయ్య

సీఎస్‌పురం(పామూరు), జూన్ 17(ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. ప్రధానమంత్రిగా 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశం అగ్రరాజ్యాల సరసన నిలబడిందని అన్నారు. మంగళవారం సీఎస్‌పురంలో జరిగిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం అధ్యక్షత వహించారు. రమణయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని చెప్పారు. మోదీ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలకు ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. ఈనెల 21న జరుగుతున్న యోగాంధ్రలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేద విద్యార్థులకు సాయం



విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న రాజేష్ కుటుంబసభ్యులు

కనిగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐ బండి రాజష్ కుటుంబసభ్యుల దాతృత్వం అనుసరణీయమని విజేత కళాశాల కరస్పాండెంట్ అరుణోదర్ అన్నారు. మంగళవారం స్థానిక విజేత కళాశాలలో పేద విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ బండి రాజేష్ ఉపకార వేతనాలు అందజేశారు. ఈసందర్భంగా అరుణోదర్ మాట్లాడుతూ రాజేష్ లాంటి దాతలు ముందుకువచ్చి పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించాలని కోరారు. ప్రతిఏటా విద్యలో ప్రగతి సాధించిన విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందజేస్తామని దాతలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోటంశెట్టి మోహన్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ వేముల శ్రీరాములు, కాకర్ల మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

కనిగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వేడుకల పేరుతో నడిరోడ్డుపై అర్ధరాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా వేడుకలను వారి ఇళ్లలో జరుపుకోవాలని సూచించారు. రోడ్లపై వేడుకల్లో పాల్గొనే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు అధికారులు తమ స్టేషన్ ల పరిధిలోని కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కాగా, స్థానిక మహిళా రెసిడెన్షియల్ హాస్టల్‌లోని విద్యార్థినులకు ఎస్‌ఐ శ్రీరాం అవగాహన కల్పించారు.



ఉష్ణోగ్రత (అంచనా)

18-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	38	29
తెనాలి	38	29
నరసరావుపేట	38	28
బాపట్ల	37	29
రెంటచింతల	37	27
చీరాల	37	29



జిల్లా పరిషత్ విభజనకు అడుగులు

- పరిపాలన పునర్వ్యవస్థీకరణకు చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ నుంచి కమిషనర్‌కు లేఖ
- మూడు జిల్లాలకు మండలాల సర్దుబాటు
- 15 నెలల్లో జడ్పీటీసీల ఎన్నికలు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌ను విభజించ నున్నారు. పరిపాలన పునర్వ్యవస్థీకరణకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రతి జిల్లాకు పరిషత్ ఏర్పాటు కానుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిషత్‌లకు మండలాలను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభంకానుంది. పంచాయతీరాజ్ డైరెక్టర్ విభజన ప్రక్రియకు సంబంధించి ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో 57 మండలాలు ఉన్నాయి. కొత్త జిల్లాల్లో ఉన్న మండలాల ఆధారంగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నారు. 2026 సెప్టెంబరులో జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం అయితే ఎన్నికలకు 15 నెలలే గడువు ఉంది. అంతకు ముందే పునర్వ్యవస్థీకరణ పూర్తి చేయాల్సి ఉంది.

ముగియనున్న జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం

జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం 15 నెలల్లో ముగియనుంది. ఎన్నికల నాటికి విభజిత జిల్లాల వారీగా పరిషత్‌ల ఏర్పాటు ప్రక్రియను పంచాయతీరాజ్ శాఖ ప్రారంభించింది. కొత్త జెడ్పీ కార్యాలయాల ఏర్పాటుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. జెడ్పీ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అధికారులు, ఉద్యోగుల సర్దుబాటు, కార్యాలయాల భవనాలు, సమావేశపు మందిరాలు, అధికారులకు సంబంధించిన గృహాలు, అతిథి గృహాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం భవనాలను ఎంపిక చేయాలి. గుంటూరు జిల్లా పరిషత్‌కు అన్ని వసతులు, కార్యాలయాలు, మీటింగ్ హాల్ ఉంది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిషత్‌లకు ఆయా వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యులు కోరుతున్నారు.

మండలాల విభజన ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న 57 మండలాల్లో పల్నాడు జిల్లాకు 28, బాపట్ల జిల్లాకు 12, గుంటూరు జిల్లాకు 18 మండలాలు కేటాయించారు. గుంటూరు రూరల్ మండలాన్ని గుంటూరు ఈస్ట్, వెస్ట్ రెండు మండలాలుగా విభజించారు. దీంతో గుంటూరుకు ఒక మండలం పెరిగినట్లయింది. 2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. అయితే జిల్లా పరిషత్‌ను విభజించలేదు. ఉమ్మడి గుంటూరు కిందే పరిషత్ నిర్వహిస్తున్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచే పరిపాలన కొనసాగుతోంది. జిల్లా పరిషత్ పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయాల పాలన జెడ్పీ కార్యాలయం కేంద్రంగానే నిర్వహిస్తున్నారు.



ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రెయిన్ పూడ్చివేతను అడ్డుకుంటున్న మత్స్యకారులు

డ్రెయినేజి పూడ్చడాన్ని అడ్డుకున్న మత్స్యకారులు

బాపట్ల-చీరాల సరిహద్దులో ఆందోళన.. ఆర్డీవో విచారణ

బాపట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపల్లెపాలెం వద్ద ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రెయిన్ పూడ్చివేతను మంగళవారం మత్స్యకారులు అడ్డుకున్నారు. అడవిపల్లెపాలెం, దాన్వాయ్‌పేట, విజయలక్ష్మీపురం, కృపానగర్, గాదె వెంకటరెడ్డి కాలనీ, రామాపురం, కనకదుర్గానగర్, చీరాల మండలం ఓడరేవు పంచాయతీలోని మత్స్యకారులు ఈ నెల 9న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి డ్రెయిన్ పూడ్చివేతపై ఫిర్యాదు చేశారు. అయినా సీమౌత్ దగ్గర డ్రెయినేజిలో పెద్దపెద్ద కొండరాళ్లు వేసి మట్టితో పూడ్చేయడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాపట్ల-చీరాల సరిహద్దులో ఆందోళన చేపట్టారు. డ్రెయిన్ ఆక్రమిస్తే వరదలు, తుఫాన్ల సమయంలో బోట్‌లు బయటకు రావడానికి ఇబ్బంది కలుగుతుంది పనులు ఆపేయాలన్నారు. తమ జీవనోపాధిని దెబ్బతీసేలా డ్రెయినేజిని పూడ్చడం దారుణమంటూ నినాదాలు చేశారు. దీంతో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా సిబ్బందితో కలిసి వచ్చి మత్స్యకారులతో మాట్లాడి డ్రెయిన్ పూడ్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. తన భూమి కోతకు గురికాకుండా ఉండేందుకే అడ్డుగా రాళ్లు వేస్తున్నట్లు రైతు బుర్ల వెంకట్రావు ఆర్డీవోకు తెలిపారు. అధికారులతో సర్వే చేయించుకుని హద్దులు నిర్ణయించిన తర్వాతే ఈవిధంగా చేస్తున్నామన్నారు. ఇప్పటికే తన పొలం అర ఎకరానికి పైగా నష్టపోయానని చెప్పారు. బోట్లు వెళ్లడానికి, రావడానికి ఆటంకం లేకుండా చూడాలని మత్స్యకారులు కోరారు. మత్స్యకారుల ఆందోళన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఉభయులకు న్యాయం చేసేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



మత్స్యకారు కుటుంబాలతో చర్చిస్తున్న నిర్వాహకులు

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా!



ముమ్మరంగా ఖరీఫ్ పనులు

- నిల్వలపై యంత్రాంగం కసరత్తు
- కొరత తలెత్తకుండా ముందస్తు సన్నద్ధతపై దృష్టి పెట్టేనా!
- కృత్రిమ కొరతపై ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు

వానలు ముందుగానే పలకరించాయి. ఖరీఫ్ సీజన్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్నదాతలు సేద్యానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టారు. సాగు పనులు ఓ వారం ముందుగానే ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో సంబంధిత వ్యవస్థలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాల వారీగా రెండు సీజన్లకు కలిపి కావాల్సిన ఎరువుల పరిమాణం ఎంత అనే లెక్కలతో పాటు ప్రస్తుతం నిల్వ ఉన్నదెంత అనే గణాంకాలను కూడా సవివరంగా తెప్పించుకుంది. దానికి అనుగుణంగానే ప్రస్తుతం నిల్వలు సమృద్ధిగానే అందుబాటులోనే ఉన్నాయని, దశల వారీగా ఎరువుల నిల్వలు పెంచుకుంటూ పోతామని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ పనులు మరో వారంలో పూర్తి స్థాయిలో ఊపందుకోనుండగా అన్నదాతలు ఒక్కసారిగా ఎరువుల కొనుగోలు మీద దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఎరువుల కొరత తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళిక రూపొందించి తదనుగుణంగా అడుగులేస్తేనే మార్కెట్‌లో ఎరువుల కృత్రిమ కొరత తలెత్తకుండా ఉండే అవకాశముంది.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగు ప్రారంభం నుంచి ఎరువుల సమృద్ధిగా ఉండడం అనేది చాలా కీలకం. ఏటా సీజన్ ప్రారంభంలో పుష్కలంగా ఉన్నట్లు కనబడే ఎరువుల నిల్వలు స్వల్ప కాలంలోనే పూర్తయి అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితి ఎదురవుతూనే ఉంది. గత ప్రభుత్వంలో ఎరువుల నిల్వల విషయంలో ఓ ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఈ పద్ధతిని గత ప్రభుత్వం దాదాపుగా భ్రష్టు పట్టించింది. ఎరువుల కోసం ప్రైవేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఎరువుల నిల్వలను సమృద్ధిగా ఉంచడంపై మే నెల చివర నుంచే కసరత్తు ప్రారంభించింది.

గత ప్రభుత్వంలో దళారీలకు పండగ

సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్న దశలో కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించి (మిగతా 6వ పేజీలో)

మూడు జిల్లాల్లో నిల్వలు ఈ విధంగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కుగాను కావాల్సిన ఎరువుల నిల్వల మొత్తం పరిమాణం 53,000 మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు 28,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇందులో యూరియా 15,000 టన్నులతో అత్యధిక వాటా కాగా, 9,000 టన్నుల నిల్వలతో కాంప్లెక్స్‌ది తర్వాత స్థానంగా ఉంది. డీఏపీ, పొటాష్, ఎస్‌ఎస్‌పీ పొటాష్ నిల్వలు కూడా సమృద్ధిగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో సీజన్ మొత్తానికి యూరియా నిల్వలు 24,000 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా అందుబాటులో ఉన్న నిల్వలు 17,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. అదే విధంగా కాంప్లెక్స్ పరిమాణం 16,000 టన్నులు అవసరం కాగా ఉన్న నిల్వ 12,000 టన్నులుగా ఉంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 65,000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ప్రస్తుతం నిల్వల రూపంలో ఉన్నది 35,000 టన్నులుగా ఉంది.



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

35 శాతం రాయితీపై యంత్రాలు

- పీఎంఎఫ్ఎంఈ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- కొత్తపేటలో యూనిట్ల పరిశీలనలో కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి జీవనోపాధి) పథకంతో రుణగ్రహీతలకు 35 శాతం రాయితీతో ఉత్పత్తి యంత్రాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. మంగళవారం వేటపాలెం మండలం కొత్తపేటలో వేరుశనగ శుద్ధియూనిట్, బాల ఆగ్రో అండ్ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఆయా యూనిట్ల లాభనష్టాలు, ముడిసరుకు కొనుగోలు తదితర సమస్యలపై ఆరాతీశారు. అలాగే శ్రీసాయితేజ వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌కు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా నిర్వాహకులు రూ.10 లక్షలు రుణం పొందారన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఏదైనా సమాచారం కోసం జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రావణి 93811 55919ను సంప్రదించాలని చెప్పారు. కలెక్టర్ వెంట ఉద్యానశాఖ అధికారి ఖలీం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దారు గోపీకృష్ణ తదతరులు ఉన్నారు.

నేడు ఏఎన్‌యూలో యోగాంధ్ర

10 వేల మందితో ఆసనాలకు ఏర్పాట్లు

పెదకాకాని, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా, వర్సిటీ అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు చేశారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఉదయం 6:30 గంటల నుంచి యోగా వేడుకలు జరగనున్నాయి. ఇందు కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాలలతో పాటు, అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు 10వేల మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొంటారన్నారు.



యోగాకు సిద్ధమైన యూనివర్సిటీ ప్రాంగణం

మండలంలో 966 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు

● డ్వామా పీడీ విజయలక్ష్మి

కర్లపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని 20 పంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 966 పనులకు 8 కోట్ల 44 లక్షల 8 వేల 891 రూపాయల నిధులు కేటాయించారని 5 కోట్ల 69 లక్షల 96 వేల 435 పని దినాలు కల్పించారని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన 18వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని సామాజిక తనిఖీ నివేదికలను పర్యవేక్షించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మండలంలోని జరిగిన ఉపాధిహామీ పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారన్నారు. పనుల వివరాలన్ని నివేదికలను ప్రజావేదికలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఎం.సువార్తమ్మ, ఎస్ఆర్‌పీ బి.తులసీనాయక్, శాట్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, ఎంపీపీ యారం వనజ, ఏపీవో శ్యామ్, సర్పంచ్ నక్కా లలితకుమారి, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు.. ఇక సాఫీగా

- కాల్వల్లో పూడికతీత.. కట్టలు పటిష్టం
- రూ.14.24 కోట్లతో శరవేగంగా 78 పనులు



పూడికలు తీసిన అనంతరం కొల్లిపర బ్రాంచ్ కెనాల్ కింద కాల్వ

వేమూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తూటికాడ తొలగిస్తున్నారు.. వ్యర్థాలతో నిండిన పూడికను తీస్తున్నారు.. కట్టలను పటిష్టం చేస్తున్నారు.. లెవలింగ్ జరుగుతోంది.. ఇక ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా, చివరి భూములకు కూడా సాగునీరు సాఫీగా పారుదలయ్యేలా కాల్వల్లో పనులు జరుగుతున్నాయి. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖకు రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేక కాల్వలు పూర్తిగా పూడిపోయాయి. కూటమి ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు కూడా చేపట్టింది. ఈ పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సాగునీటి కాల్వల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. నీటి సంఘాల సూచనల మేరకు ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కాల్వల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయా పనులకు రూ.14.24 కోట్ల నిధులను కేటాయించారు. దీంతో తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని నెంబరు-1 కాల్వ సెక్షన్, వేమూరు నెంబర్-2 సెక్షన్, కొల్లూరు నెంబరు-3 సెక్షన్, వెల్లటూరు పరిధిలోని కాల్వల్లో పూడికతీతలు, కట్టలు బలోపేతం చేసే 78 రకాల పనులు శరవేగంగా చేపట్టారు. నీటి పారుదల శాఖలో ప్రధాన కాల్వలతో పాటు సబ్ చానల్స్‌లో కూడా పనులు ప్రారంభించారు. మురుగునీటి పారుదల శాఖ ద్వారా కోటి 24 లక్షల 31 వేలతో పనులు జరుగుతున్నాయి. దెబ్బతిన్న 19 కాల్వల్లో పూడికతీతతో పాటు కట్టలు బలోపేతం చేస్తున్నారు. మరో 30 లక్షల నిధులతో భట్టిప్రోలు, రేపల్లె తుంగభద్ర మేజర్ డ్రెయిన్‌లో తూటికాడ తొలగించి పూడికతీతలు ప్రారంభించారు.



రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లో జరుగుతున్న మరమ్మతులు



తూటుకాడ తొలగింపు

పాఠశాలలను యోగాశాలలుగా మార్చాలి

కలెక్టర్‌కు సూచించిన విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

బాపట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలను యోగాశాలలుగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు కలెక్టర్ వెంకటమురళికి సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి విద్యాశాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటమురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ 9, 10, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. ఈనెల 21న జిల్లా లోని అన్ని విద్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. 18, 19 తేదీల్లో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. తల్లికి వందనం అందని కుటుంబాలకు టెక్నికల్ సమస్యలు ఎదురైతే క్లియర్ చేసేలా అధికారులు సూచనలు చేయాలని చెప్పారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసాపూర్, తిరుపతి, జల్నాకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, తిరుపతి, జల్నాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07233) చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు నరసపూర్ చేరుకొంటుంది. (07234) నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 6 నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. (07609) జల్నా - తిరుపతి ప్రత్యేక రైలు జూలై 7 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.45కి తిరుపతి చేరుకొంటుంది. (07610) తిరుపతి - జల్నా ప్రత్యేక రైలు జూలై 8 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 3.50కి జల్నా చేరుకొంటుందన్నారు.

సచివాలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

- 90శాతానికి పైగా స్థానచలనం
- ప్రభుత్వఆదేశాలతో ఆయా శాఖల్లో కసరత్తు

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఆయా ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఈ నెలాఖరులోపు బదిలీలను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో తదనుగుణంగా అధికారులు చర్యలను ప్రారంభించారు. జిల్లాలో గ్రామ సచివాలయాలు 597, వార్డు సచివాలయాలు 122 కలిపి 721 ఉన్నాయి. అందులో గ్రామ సచివాలయాల్లో 5,566 మంది, వార్డు సచివాలయాల్లో 1,058 మంది ఉద్యోగులు కలిపి 6,624 మంది పనిచేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను 2019లో ఏర్పాటు చేశారు. అప్పట్లో కొత్త నియామకాలు చేపట్టి భర్తీచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులను సొంత మండలంలోనే నియమించింది.

- ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

పూర్తిస్థాయిలో మార్పు

ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను నియమించి ఐదేళ్లు పూర్తికావడంతో బదిలీలు చేపట్టాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగు లను సొంత మండ లంలో కాకుండా ఇతర మండలాలకు బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో సుమారు 90శాతం వరకు సొంత మం డలంలో పనిచేస్తుండగా కేవలం 10 శాతం మాత్రమే ఇతర మండలాల్లో పని చేస్తున్నారు. దీంతో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల్లో పది శాఖలకు సంబంధించి ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ, సర్వే, పోలీస్, ఉద్యాన, ఎనర్జీ తదితర శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉన్నారు. దీంతో ఆయా శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులను బదిలీలు చేసేందుకు కసరత్తును ప్రారంభించారు.

రేషనలైజేషన్ అమలు

ఇప్పటికే ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన సచివాలయాలను రేషన్‌లైజేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం జనాభాతో సంబంధం లేకుండా సచివాలయాల్లో 8 నుంచి 11మంది వరకు పనిచేస్తున్నారు. ప్రస్తుత రేషనలైజేషన్ ప్రకారం మూడు కేటగిరీలుగా సచివాలయాలను విభజించారు. ఏ కేటగిరీ సచివాలయంలో ఆరుగురు, బీ కేటగిరిలో ఏడుగురు, సీ కేటగిరీలో ఎనిమిది మంది ఉద్యోగులను నియమించే విధంగా చర్యలు తీసుకున్నారు. అలా రేషనలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తికావడంతో తదనుగుణంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ బదిలీల అనంతరం సచివాలయాల్లో మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖల ద్వారా ఇతర పనులను వినియోగించుకునే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ముందుగా ప్రభుత్వ శాఖల వారీగా ఉద్యోగుల వివరాలను కంప్యూటీకరణ చేస్తున్నారు.

నాయకుల ద్వారా సిఫార్సులు

ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగి ఎక్కడ పనిచేస్తున్నారు? సొంత మండలంలో పనిచేస్తున్నారా లేదా ఇతర మండలాల్లో పనిచేస్తున్నారా? లాంటి డేటా తయారు చేస్తున్నారు. కేవలం పది శాతం మంది ఉద్యోగులు మాత్రమే ఇతర మండలాల్లో పనిచేస్తుండగా మిగిలిన వారందరూ సొంత మండలాల్లోనే పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో ఇప్పుడు వారందరినీ సమీప మండలాలకు బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా ఆయా శాఖల అధికారులు చర్యలు ప్రారంభించారు. దీంతో సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ఇతర మండలాలకు బదిలీ కావాల్సి ఉండటంతో వారు పరుగులు పెడుతున్నారు. తదనుగుణంగా తమకు తెలిసిన నాయకుల ద్వారా సిఫార్సులను చేయించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే ఆశాఖల అధికారులకు కొన్ని ప్రాంతాల నుంచి సిఫార్సు లేఖలు కూడా అందినట్లు సమాచారం.

సమగ్ర శిక్షలో బదిలీలకు షెడ్యూల్

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బంది, సీఆర్‌ఎంటీలు, మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఈఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీసు సబార్డినేట్లు, సైట్ ఇంజనీర్లు తదితరులను బదిలీ చేస్తారు. బదిలీలు పరస్పరం, అభ్యర్థన మేరకు మాత్రమే జరుగుతాయి. రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసిన వారిని మాత్రమే బదిలీ చేస్తారు. జిల్లా, మండల స్థాయిలో బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేశారు. జిల్లాస్థాయిలో బదిలీలకు ఈనెల 19 నుంచి 21 వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న బదిలీల సీనియార్టీ జాబితా తయారు, 24న సీనియార్టీ జాబితా ప్రకటన, 27న సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 28న అభ్యంతరాలు పరిష్కరించి తుది జాబితాను ప్రకటిస్తారు. 30 నుంచి జూలై 2 వరకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారని డీఈవో, సమగ్ర శిక్ష డీపీవో కిరణ్‌కుమార్ తెలిపారు. అంతర్ జిల్లా బదిలీలు కోరుకునే ఉద్యోగులు రెండు రోజుల్లో తమ దరఖాస్తులు సమర్పిస్తే రాష్ట్ర కార్యాలయానికి పంపుతామని డీఈవో తెలిపారు.

వైద్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



వైద్య ఉద్యోగులకు బదిలీల వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల వెబ్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలు క్యాడర్ల ఉద్యోగుల బదిలీలకు ప్రక్రియ నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫైపిస్టులు, ఆఫీసు అటెండర్లు, జూనియర్ సహాయకులు, వాచ్‌మెన్లు, ఎంఎన్‌వోలు, ఎఫ్‌ఎన్‌వోలు, స్వీపర్లు వారు పనిచేస్తున్న కార్యాలయం నుంచి వెబ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా కేడర్ల వారీగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా స్క్రీన్‌పై ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచారు. వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్, డేటా మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యంత ప్రతిష్టాత్మకమైన థల్ సైనిక్ క్యాంపులకు ఎంపికై సత్తా చాటారు. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.విజయ్, అభిషేక్ చీరాలలో జరిగిన ఎన్‌సీసీ క్యాంపులో ప్రతిభ చాటి వచ్చేనెల 12న అనంతపురంలో జరగనున్న థల్ సైనిక్ క్యాంపులో పాల్గొనున్నారు. అలాగే ఈనెల 8నుంచి 17వ తేదీ వరకు జరిగిన మాన్యువల్ శిక్షణ క్యాంపులో కూడా కళాశాల క్యాడెట్లు తమ ప్రతిభను చాటారు. ఫైరింగ్ విభాగంలో బాలికలు జి.వైష్ణవి, జాప్రిన్, బాలుర విభాగంలో ఆర్.సురేంద్ర, లక్ష్మీనారాయణలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. టెంట్ ఫిక్సింగ్‌లో సీనియర్ డివిజన్ క్యాడెట్లు మొదటి బహుమతి సాధించారు. డ్రిల్‌లో కూడా ఎన్‌సీసీ క్యాడెట్లు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, హెచ్‌వోడీ శ్రీనివాసరావు, సీహెచ్.హిమబిందు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఎన్‌సీసీ వంటి వాటిలో శిక్షణ తీసుకోవడం ద్వారా శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారని వారుప పేర్కొన్నారు. చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ముందుకు పోవాలన్నారు.

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా..!

(5వ పేజీ తరువాయి)

దళారులు సొమ్ము చేసుకోవడం గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగింది. ముఖ్యంగా డీఏపీ విషయంలో ఈ తంతు పెద్ద ఎత్తున నడిచేది. ఎంఆర్‌పీ కన్నా దాదాపు రూ.50లు అదనంగా వసూలు చేసి అన్నదాతలను నిలువునా వంచించారు. ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత రానివ్వకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కానీ అందుకు తగినట్లుగా సంబంధిత వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా లేదా అనేదే ఇక్కడ తలెత్తుతున్న ప్రశ్నగా ఉంది. ఖరీఫ్ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇందుకు తగినట్లుగా మార్క్‌ఫెడ్ నిత్యం ఎరువుల లభ్యతపై దృష్టిపెట్టాల్సి ఉంది. రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీలలో ఉన్న నిల్వలపై వారాంతపు సమీక్షలు నిర్వహించి డిమాండ్‌కు అనుగుణంగా నిల్వలు పెంచుకునే కసరత్తు క్రమం తప్పకుండా చేయాల్సి ఉంది. సమాంతరంగా బయటి మార్కెట్‌లో ఉన్న ఎరువుల నిల్వల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై సంబంధిత వ్యవస్థలు కొరడా ఝుళిపిస్తేనే ఎరువుల పంపిణీ సజావుగా జరిగి అన్నదాతకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

లైసెన్సులు రద్దు చేస్తాం

ఎరువుల క్రయవిక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయడానికి కూడా వెనకాడబోమని తాజాగా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. వ్యాపారులు ఎరువుల అమ్మకాల్లో కచ్చితంగా ఈ-పోస్ ద్వారా రియల్ టైం స్టాక్ రసీదు విధానం పాటించాలనే ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. దీని ద్వారా ఎరువుల నిల్వలు ఎంతమేర ఉన్నాయనే సమాచారం తెలుసుకోవడం వ్యవస్థలకు తేలికవుతుందనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు పర్యవేక్షించాలని కూడా ప్రభుత్వం తెలిపింది. కానీ సీజన్ ఆరంభంలో ఇలాంటి హడావిడి మామూలే అన్న ధోరణిలో వ్యాపారుల వైఖరి ఉంటుంది. గడచిన మూడేళ్లలో ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు సంబంధించి ఎన్ని షాపుల మీద చర్యలు తీసుకున్నారనేదానికి ఆయా విభాగాల వద్ద సమాధానమే కొరవడింది.

అభివృద్ధి దిశగా దొనకొండ

- సోలార్ పార్కు ఏర్పాటుపై మంత్రి రవికుమార్ ప్రకటన
- డిఫెన్స్ మాన్యుఫ్యాక్టర్ హబ్ ఏర్పాటుపై ఢిల్లీలో సీఎం ప్రకటన

దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో పలు కంపెనీలు ఇప్పటికే తమకు అవసరమైన భూములను పరిశీలించి వెళ్లాయి. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఇక్కడ తమకు అవసరమైన సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చూస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో దొనకొండలో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం, ప్రధాన రైలుమార్గం కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. అందుకే పలు కీలక పరిశ్రమల దృష్టి పడింది. వీటి రాకతో దొనకొండ దశ మారనుందని ప్రజలు భావిస్తున్నారు.



దొనకొండ విమానాశ్రయ భూమి పరిశీలిస్తున్న గన్నవరం ఎయిర్‌పోర్టు అధికారులు(ఫైల్

దొనకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అడుగులు పడుతున్నాయి. దొనకొండ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో దొనకొండ కారిడార్ అభివృద్ధిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు ఖాయమని ప్రజలు భావిస్తున్నారు. దీంతో ఎంతో వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉద్యోగులు, పేదలకు ఉపాధి అవకాశాలు ఖాయమనే చర్చ నడుస్తోంది. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దొనకొండలో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకెళ్తుండటంతో ఇక్కడ కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపిందని ప్రజలు భావిస్తున్నారు.

ఐదు వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు

ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక పారిశ్రామిక సంస్థలు వచ్చాయి. జిల్లాలోనూ పలువురు బడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ క్రమంలోనే దొనకొండలోనూ పరిశ్రమలు స్థాపించేందుకు అడుగులు పడుతున్నాయి. ఐదువేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తామని ఇప్పటికే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం కనిగిరి ఆర్డీవో ఇతర అధికారులు భూములను పరిశీలించారు. ఇటీవల భూముల తాజా పరిస్థితిపై రెవెన్యూ అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు.

ఏపీఐఐసీకి భూములు

తాజాగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీ కింద పది భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో దొనకొండలో 380 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగేలా రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దొనకొండ మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, రుద్రసముద్రం, భూమనపల్లి గ్రామాలకు చెందిన 2,395 ఎకరాల ప్రభుత్వ ఇప్పటికే ఏపీఐఐసీకి అప్పగించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన భారీ పారిశ్రామిక పార్క్ ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

డిఫెన్స్ మాన్యుఫ్యాక్టర్ హబ్

ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల ఏర్పాటు గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి చర్చించారు. అనంతరం దొనకొండ ప్రాంతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు చెందిన డిఫెన్స్ మాన్యుప్యాక్చర్ హబ్ కింద మిసైల్ ఎవియేషన్ ప్రాజెక్టు ఆరు వేల ఎకరాల్లో ఏర్పాటుకు విజ్ఞప్తి చేసినట్లు ప్రకటించారు. ప్రభుత్వ ప్రోత్సాహంలో భాగంగా దొనకొండ ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం మహారాష్ట్రకు చెందిన ఏరోస్పేస్ పయనీర్ క్లీన్ యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు 50 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం గత నెల ఈ ప్రాంతంలోని అనువైన భూములను పరిశీలించారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు అథారిటీ శిక్షణ కేంద్రం ఏర్పాటు నిమిత్తం అన్నీ జిల్లాల్లోని విమానాశ్రయాలను పరిశీలించే క్రమంలో గన్నవరం ఎయిర్‌పోర్టు అధికారులు గతనెల దొనకొండలోని ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు ఈ బృందం వచ్చినట్లుగా విశ్వసనీయ సమాచారం.

'తల్లికి వదనం'కు గ్రీవెన్స్

కొత్తగా చేరే వారికి 30 వరకు అవకాశం



వార్డు సచివాలయంలో 'తల్లికి వందనం' కోసం అర్జీ పెట్టుకుంటున్న లబ్దిదారులు

ఒంగోలు విద్య, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అర్హులైన తల్లులకు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. గత సంవత్సరం నుంచి విద్యా సంస్థల్లో కొనసాగుతూ ఉండి అర్హత కలిగి నగదు జమకాని విద్యార్థులకు మరో అవకాశం కల్పించింది. ఏ కారణంతో వారి తల్లుల ఖాతాలకు నగదు జమకాలేదో తెలుసుకొని తగు ఆధారాలతో అర్జీ ఇస్తే రెండో విడత వచ్చేనెల 5న వీరి ఖాతాలకు నగదు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేసింది. తల్లులకు ఏ కారణంతో తిరస్కరించారనే వివరాలు ఆ సచివాలయాల్లోనే తెలుస్తాయి. ఆ వివరాలు తెలుసుకొని అర్హత ఉన్నా తప్పుగా తమను అనర్హులుగా తేల్చారని తల్లులు భావిస్తే అందుకు తగిన ఆధారాలతో ఈనెల 20లోపు నిర్ణీత ప్రొఫార్మాలో అర్జీని పూరించి ఆధారాలతో జతచేసి సమర్పించాలి. అందుకోసం ప్రభుత్వం ఈ నెల 20 వరకు అవకాశం కల్పించింది. అలా వచ్చిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చివరగా జాయింట్ కలెక్టర్ వివరాలను పరిశీలించి అర్హులని తేల్చి ఆ జా బి తా కు ఆమోదముద్ర వేస్తే వారికి జూలై 5న నగదు జమ అవుతుంది.

పథకానికి అర్హులు వీరే..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి చదువుతున్న పేద కుటుంబాల విద్యార్థులు తల్లికి వందనం పథకం పొందేందుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12వేలు ఆదాయం మించనివారు, కుటుంబంలో కనీసం ఒకరికైనా బియ్యం కార్డు ఉన్నవారు, మూడు ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట భూమి మించనివారు, నాలుగు చక్రాల వాహనాల్లో ట్యాక్సీ, ట్రాక్టర్లు ఉన్నవారు, విద్యుత్ బిల్లు నెలకు సగటున 300 యూనిట్లకు మించనివారు, పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో వెయ్యి చదరపు అడుగులలోపు స్థలం ఉన్నవారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు అర్హులు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు రూ.10వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేల లోపు ఆదాయం ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. నవోదయ, ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు కాదు. ఇలా ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంటే తల్లికి వందనం పథకం వర్తిస్తుంది. బేస్తవారపేట మండలం పిటికాయగుళ్ల జడ్పీ హైస్కూలు చదువుతున్న ఒకరికి ఈ పథకం నగదు పడలేదు. దీంతో వారు ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం, డీఈవో కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలి

ఒంగోలు విద్య, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో నిర్వహించిన యూనియ న్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని విద్యా సంస్థలు ఎటువంటి అ నుమతులు లేకుండా స్కూళ్లను నిర్వహిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. అనుమతులు లేకపోయినా అధికారుల అండదండలతో పాఠ శాలలు నిర్వహిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి పాఠశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు తల్లికివందనం పథకం అమలు చేయడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అవినా ష్, ఉపాధ్యక్షుడు వర్షిత్, గోపి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

విద్యార్థి దశలోనే భవిష్యత్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉన్నప్పుడే భవిష్యత్‌లో తమకు లభించే ఉద్యోగ, వృత్తిపరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ అన్సారియా చెప్పారు. ఆ దిశగా ఉజ్వల భవిష్యత్ పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూట్ టు రైజ్ ట్రైవ్ ఫౌండేషన్, జిల్లా బాలల వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలతో పాటు పాఠ్యాంశేతర విషయాల్లోనూ విద్యార్థులు రాణించాలని చెప్పారు. ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ల స్థాయిలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ రంగాల్లో అందుబాటులో ఉండే ఉద్యోగావకాశాలను తెలియజేసేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విద్యార్థులు ఆశక్తిగా తిలకించారు. ఆయా అంశాలపై నిర్వాహకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సువర్ణ, చంద్ర మౌళీశ్వరరావు, దినేష్‌కుమార్, బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి గిరిధర్‌శర్మ, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రషీద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు ఉన్నారు.

తల్లికి వందనంపై జగన్‌రెడ్డి విమర్శలు సిగ్గుచేటు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకంపై వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి విమర్శలు సిగ్గుచేటని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మంగళవారం అన్నారు. తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి నగదు జమ అయి తల్లులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఈ పథకంపై బులుగు పార్టీ విషం చిమ్మడం దుర్మార్గమని చెప్పారు. ఇచ్చిన హామీలను వైసీపీ పాలకులు అమలు చేయకుండా ప్రజలను మోసగించారని ఎరిక్షన్‌బాబు గుర్తు చేశారు. అలాంటి వ్యక్తులు హామీలు అమలు చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. గతంలో అమ్మఒడి పథకం అమలు తీరు, ప్రస్తుత తల్లికి వందనం అమలు తీరును ప్రజలు గమనిస్తున్నారని, మీరు చెప్పే అబద్ధపు మాటలు వినే పరిస్థితిలో ఎవరూ లేరని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు చదివిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను మోసగించారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలవుతుండడాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెప్తారని ఎరిక్షన్‌బాబు అన్నారు.

కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు



కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమణబాబును మంగళవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కమిషనర్‌కు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి శాలువతో సన్మానించారు. కమిషనర్‌ను కలిసిన వారు పట్టణ పార్టీ అధ్యక్షుడు షానే షావలి, కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రమేష్, సుబ్బారావు, షెక్షావలి, పందీటి రజిని, సంపత్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్, డానియేలు, మద్దులేటి, దస్తగిరి ఉన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని కమిషర్‌ను కోరారు.

సమస్యల పరిష్కారానికే అదాలత్



అర్జీలను స్వీకరిస్తున్న రిటైర్డు న్యాయాధికారి ఇమ్మానియేలు

కంభం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే అదాలత్, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేలు తెలిపారు. కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏబీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన మార్కాపురం డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ గృహ వినియోగదారులు, వ్యవసాయ రైతులు, మిల్లులు, ఫ్యాక్టరీలలో విద్యుత్ వినియోగించే వారికి ఏ సమస్య వచ్చినా ఇలాంటి అవగాహన సదస్సులో గాని, లేదా విజయవాడలోని గుణదలలో ఉన్న విద్యుత్ ప్రధాన కార్యాలయంలో గాని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. మంగళవారం జరిగిన అదాలత్‌లో మొత్తం 16 మంది అర్జీలు ఇవ్వగా అందులో 6 సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. 9 మంది బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, నలుగురు లోవోల్టేజ్ సమస్యలపై, ముగ్గురు మీటర్లను వేరేచోటికి మార్చాలని అర్జీలను అందచేశారు. కార్యక్రమంలో కంభం ఏడీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ నరసయ్యతోపాటు సాంకేతిక సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వర్లు, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, మార్కాపురం, యర్రగొండపాలెం ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి

- పాఠశాల విద్యా కమిషనర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జా తీయ యోగా దినోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చేం దుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ఈ నెల 18నుంచి మూడు రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం ఒక గంట పా టు యోగాసనాలు సాధన చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు యోగాసనాలపై దిశా నిర్దేశం చేశారు. ఆయా అంశాలపై మం డల ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి యోగా కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల అ ధికారులు చిరంజీవి, బీమ్‌నాథ్, చంద్రమౌళీశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీ సమావేశానికి మాగుంట హాజరు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మంగళవారం జరిగిన ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ కేసీ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులతో పాటు అధికారులు హాజర య్యారు. ఈ సందర్భంగా మాగుంట పలు అంశాలపై మాట్లాడారు.

అవీ..ఇవీ..

బీటీ రోడ్డు పనులను తనిఖీ



బీటీ రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

బల్లికురవ. జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెన్నుపల్లి - వైదన గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను మంగళవారం జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం తనిఖీ చేసింది. చెన్నుపల్లి-వైదన రోడ్డుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది.. ఈ నిధులతో గ్రామాల మధ్య తారు రోడ్డు పనులు చేపడుతున్నారు. ముందుగా వెట్‌మిక్స్ వేయగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు రోడ్డు నాణ్యతపై యంత్రాల ద్వారా తనిఖీలు చేశారు. రోడ్డులో నాణ్యత లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. రోడ్డు నాణ్యతకు తీసుకోవాల్సిన చర్యలపై వారు పలు సూచనలు చేశారు. బీటీ రోడ్డు నాణ్యతపై ల్యాబ్‌రిపోర్టు తీసుకొంటామన్నారు. ఈ తనిఖీలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఆశోక్, డిప్యూటీ ఈఈ శ్యాంప్రసాద్, రమేష్, ఏఈ శ్రీనివాస్, మండల పీఆర్ ఏఈ మాధవ్ పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులను అందజేస్తున్న మస్తాన్‌రావు, కల్యాణి దంపతులు

అద్దంకిటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆశ్రమంలోని వద్ధులకు నూతన దుస్తులను అందజేశారు. కాకానిపాలేనికి చెందిన గోరంట్ల వివేక్ ఆస్ట్రేలియాలో కొత్తగా ఉద్యోగంలో చేరిన సందర్భంగా వారి తల్లిదండ్రులు గోరంట్ల మస్తాన్‌రావు, కల్యాణి దంపతులు శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహకులు రావూరి రంగయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్‌పై అవగాహన

పర్చూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో పర్చూరులో ఈనెల 19న విద్యుత్ అదాలత్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని చీరాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.జాన్ థామస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు, సూపరింటెండింగ్ ఇంజనీర్, బాపట్ల జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొంటారన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన



రావినూతలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మేదరమెట్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : రావినూతలకు చెందిన ప్రముఖ బిల్డర్ దివంగత చప్పిడి హనుమంతరావు జ్ఞాపకార్థం రావినూతలలోని షిరిడీసాయిబాబా మందిరంలో ఒంగోలుకు చెందిన జిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 198 మంది రోగులకు డాక్టర్ మాదాల పూజిత, డాక్టర్ నరసింహారావులు వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లములు, నీటికాసులు ఉన్నవారిని గుర్తించి, 80 మందికి ఆరోగ్యశ్రీ కార్డుపై ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి తీసుకువెళ్లారు. ఈ వైద్యశిబిరంలో వైద్యశాల సిబ్బంది గౌస్, వందనం, కౌసల్య, రమణయ్య తదితరులతో పాటు గ్రామస్థులు కారుసాల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీవోను కలిసిన ఏపీఎన్‌జీవో సంఘ నేతలు



ఎస్టీవో ఖాదర్‌ను కలిసి అభినందించిన ఏపీ ఎన్‌జీఓ సంఘం నేతలు

అద్దంకి, జూన్17(ఆంధ్రజ్యోతి): అద్దంకి సబ్‌ట్రెజరీ అధికారి(ఎస్‌టీఓ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఖాదర్‌ను మంగళవారం ఏపీఎన్‌జీవో సంఘం నేతలు కలిసి అభినందించారు. అద్దంకి తాలూకా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి టి.రమేష్‌బాబు, ఏడుకొండలు, రవికుమార్, శ్రీనివాసరావు తదితరులు ఎస్టీవో ఖాదర్ ను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు.

నేడు ఇంకొల్లులో ధర్నా

ఇంకొల్లు,జూన్ 17,(ఆంధ్రజ్యోతి) : పొగాకు కొనుగోలులో కాలయాపనకు నిరసనగా ఈ నెల 18న ఇంకొల్లు మార్కెట్‌యార్డు వద్ద జరగనున్న ధర్నాను పొగాకు రైతులు విజయవంతం చేయాలని జిల్లా రైతుసంఘం కార్యదర్శి తలపనేని రామారావు, ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు రైతులందరూ మార్కెట్‌యార్డు వద్ద జరిగే నిరసన ధర్నాలో పాల్గొనాలని కోరారు.

ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మార్టూరు నుంచి నాగరాజుపల్లి వెళ్లే మార్గంలో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు ఎం.హనుమయ్య రోడ్డుపై పడి గాయపడ్డాడు. దీంతో ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నల్లబర్లీ పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతు సంఘం జిలల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం నాగులుప్పలపాడులో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు ధరలు ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడితో ఈ ఏడాది అధికంగా సాగు చేశారని, రైతులను ప్రో త్సహించిన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు చేతులెత్తేశారని చెప్పారు.

ఏబీసీ కాలువలను కమ్మేసిన చిల్లచెట్లు

- చిట్టడవిని తలపిస్తున్న కాలువ కట్ట
- ముళ్లచెట్లతో మూసుకుపోయిన దారి
- తక్షణమే మరమ్మతు చేయాలంటున్న రైతులు

బల్లికురవ. జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువ కట్ట చిట్టడవిని తలపించేలా ముళ్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో కాలువ కట్ట గుండా పోలాలకు వెళ్లే రైతులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పెద్ద చెట్లతో కాలువ కట్టపై గుండా వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



సూరేపల్లి వద్ద చిట్టడవిని తలపిస్తున్న కాలువ కట్ట

అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువ ప్రాంభం అయ్యే 18 వ మైలు నుండి దిగువ భాగంలో ఉన్న 38వ మైలు వరకు పలు చోట్ల పెద్ద ఎత్తున ముళ్ల చెట్లు అల్లుకొని ఉన్నాయి. కాలువ కట్టపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముళ్ల పొదల మధ్య గుండా వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు అంటున్నారు. సంత మాగులూరు, బల్లికురవ, అద్దంకి, మార్టురు, పంగులూరు, తదితర మండలాల పరిధిలో ఉన్న ఏబీసీ కాలువ కట్టపై ముళ్ల చెట్లు అధికంగా ఉన్నాయని రైతులు తెలిపారు. రానున్న పంట సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే కాలువ కట్టను మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



వైదన వద్ద కాలువకట్టపై ఉన్న ముళ్లచెట్లు

బల్లికురవ మండల పరిధిలోని వైదన, సూరేపల్లి గ్రామాల వద్ద అయితే ఏబీసీ కాలువ కట్టపై దట్టంగా ముళ్ల చెట్లు ఉన్నాయని రైతులు తెలిపారు. కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలో అయితే చెట్లు తొలగించే పనులు చేయటం కష్టం అని వారు అంటున్నారు. ఏబీసీ కాలువ పరిధిలో సుమారు 20 కిలోమీటర్ల మేర ముళ్లచెట్లు ఉన్నాయని వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

అక్రమ రిసార్ట్ నిర్మాణం అడ్డగింత

విజయలక్ష్మీపురం(చీరాల), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సముద్రంలో వేట సాగించి జీవనంసాగిస్తున్న మత్స్యకారుల జీవనవిధానాలతో ఆక్రమణ దారులు చెలగాట మాడుతున్నారు. చీరాల మండలం విజయ లక్ష్మీపురం వద్ద తీరంలోకి ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇది వాస్తవానికి బాపట్ల మండలం ఆడవిపల్లిపాలెం పరిధిలో ఉండగా, వేట విరామ సమయంలో విజయలక్ష్మీపురం, దానవాయిపేట, వాడరేవు, అడవిపల్లెపాలెం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు బోటులు నిలుపుకుంటున్నారు. దీనిపై కన్నేసిన ఆక్రమణదారులు కాలువ పూడ్చి రిసార్ట్ నిర్మించేందుకు పథకం పన్నారు. దీంతో సమాచారం అందుకున్న మత్స్యకారులు ఆక్రమణలు అడ్డగించారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అయితే ఇది తమకు చెందిందని అవతలి వర్గం చెబుతున్నారు. మత్స్యకారులు మాత్రం పెద్దఎత్తునే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బాపట్ల అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కబెట్టారు. విషయంపై ఆరా తీస్తున్నారు.



చదును చేయడాన్ని అడ్డుకుంటున్న మత్స్యకారులు

అద్దంకిలో అలంకారప్రాయంగా ఆటోనగర్

అద్దంకి, జూన్17(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని ఆటోనగర్ అలంకారప్రాయంగా మారింది. మూడు దశాబ్దాల క్రితం శింగరకొండ రోడ్డుకు సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేసి సుమారు 100 మంది కార్మికులకు కేటాయించారు. అయితే కొంతకాలం పాటు మౌలిక వసతులు లేవని మెకానిక్ షెడ్డులు ఏర్పాటు కాలేదు. సుమారు దశాబ్ద కాలం క్రితం ఆటోనగర్‌కు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అయితే మెకానిక్ షెడ్లు మాత్రం వేళ్ళ మీద లెక్కపెట్టే స్థాయిలో మాత్రమే ఏర్పాటు చేశారు. అత్యధికశాతం ప్లాట్లు పొందిన వ్యక్తులు, మెకానిక్ లు ఇతరులకు అమ్మకాలు చేశారు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంకా అత్యధిక శాతం ప్లాట్లు ఎలాంటి నిర్మాణం చేయకుండా ఖాళీగానే ఉన్నాయి. ఇక మెకానిక్ షెడ్లు మాత్రం అద్దంకి పట్టణంలో రోడ్ల వెంబడి, ఇతర ప్రాంతాలలో నిర్వహించుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో నివాసగృహాలు, దుకాణాల నిర్వహకులు ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో రోడ్డు అంచుల్లో మెకానిక్ షెడ్లతో వాహనచోదకులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆటోనగర్ ఏర్పాటు లక్ష్యం నీరుగారినట్లయింది. ఇప్పటికైనా ఆటోనగర్‌కు మెకానిక్‌షెడ్ తరలిపోయేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆటోనగర్‌లో మెకానిక్ షెడ్ల స్థానంలో నిర్మించిన ఇళ్లు



ఖాళీగా ఉన్న స్థలాలు

గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాటం

రైతు సంఘం ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి

మద్దిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి తెలిపారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయకుండా చోద్యం చూస్తుందని, వ్యాపారులు సిండికేట్ అయి ధరలు కల్పించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఈ నెల 20న పొగాకు రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకౌలు రైతులు పొగాకు పంట అధికంగా సాగు చేశారని, అయితే గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వీరారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రైతులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వర రావు, చెరుకూరి వాసు, శ్రీరామ్మూర్తి, వెంకయ్య, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

- పర్చూరులో రూపుదిద్దుకుంటున్న కల్యాణ మండప నిర్మాణం

పర్చూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లో నిర్మించిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి వార్ల ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు చల్లా రోజా రావు, ప్రగతి దంపతులు బచ్చల మునికన్నయ్య, సీతాలక్ష్మిల జ్ఞాపకార్థం రూ.5లక్షల నగదును మంగళవారం అయల కమిటీ ప్రతినిధులకు అందజేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటా హరి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రంగిశెట్టి ఆంజనేయులు, కఠారి సురేంద్రబాబు, తులసి శివనాగేశ్వరరావు, తులసి అప్పారావు, తులసి భువనేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, యద్దనపూడి శేషు, రంగిశెట్టి రామాంజనేయులు, తులసి నాగు, మారుతీ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదును అందజేస్తున్న దాతలు

విద్యాప్రగతికి దాతల తోడ్పాటు అభినందనీయం

- ఎంఈవో నాగభూషణం



దాతలు అందజేసిన పుస్తకాలతో విద్యార్థులు

పంగులూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యా ప్రగతికి దాతల తోడ్పాటు అభినందనీయమని ఎంఈవో కే.నాగభూషణం అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు పాలపర్తి కోటయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు జయకుమార్, ప్రసన్న సమకూర్చిన నోట్ పుస్తకాలను ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు మంగళవారం విద్యార్థులకు అందజేశారు. పాఠశాల హెచ్ఎం గుర్రం లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలపర్తి ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు బాచిన రాధారాణి, మాధవి, మస్తాన్‌వలి, జాకబ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు



కేజీబీవీ విద్యాలయంలో బాలికలతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలికలకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని బల్లికురవ ఎస్ఐ వై.నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికల కోసం ఉన్న చట్టాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. అలానే ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చదువులో ముందు ఉండే బాలికలకు ప్రత్యేక ప్రోత్సహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ప్రిన్సిపాల్ సరళకుమారి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

చినగంజాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానం వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి ఆలహరి శేషతల్పసాయి స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థానంలో 18వ తేదీ నిత్యహోమాలు, 19న స్వామి వారికి అభిషేకాలు, కల్యాణం, 20న చక్రస్నానం, భక్తులకు అన్నప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విశేష అలంకరణలో కోదండరామస్వామి

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో

అద్దంకిటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయడం ద్వారా భూసారం పెరుగుతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. 20 రకాలు విత్తనాలు కలిగిన కిట్‌లను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. దీనివలన 35 నుండి 45 టన్నుల పచ్చిరొట్ట ఎరువులు తయారవుతుందని, దీనివలన సేంద్రీయ కర్బనశాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ రోజీ, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : ఖరీఫ్ సీజన్‌లో రైతులు భూసార పరీక్షల ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని ఏవో పి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వేమవరం, కొప్పెరపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు అర్హత ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. అలానే రైతులు పంటలు సాగు చేసే ముందు విత్తనాలను అనుమతి ఉన్న డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. పంటమార్పిడితో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో మౌలాలి, వీఏఏలు వెంకటేష్, సుభాని పాల్గొన్నారు.



వేమవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

మార్టూరు : మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం, వలపర్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది రైతులు మొక్కజొన్న పంట వైపు అధికంగా మొగ్గు చూపుతున్నారన్నారు. అందుకు రైతులు విత్తనకొనుగోలులో జాగ్రత్త వహించాలన్నారు. అందుకు సంబందించి బిల్లులను భద్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చైతన్య, హరి తదితరులు పాల్గొన్నారు


ఇంకొల్లు : ఇంకొల్లు మండల పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో మీరమ్మ తెలిపారు. మండలంలోని నక్కలపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు పాల్గొని పచ్చిరొట్ట విత్తనాలు సాగుతో ఉపయోగాలను వివరించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను గురించి వివరించారు. ప్రతి కౌలురైతు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : రైతులు పంటసాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధికదిగుబడులు సాధించాలని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో మంగళ వారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసారం కోసం పచ్చిరొట్ట విత్తన సాగు చేపట్టి పూతదశలో భూమిలో కలియ దున్నాలన్నారు. పంటమార్పిడి, నేలపరీక్షల ఫలితాలను వివరిం చారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ మురళి, వ్యవసాయ సహాయకులు పృధ్వీసాయి, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి (మార్టూరు) : రైతులు తమ పొలాల్లో భూసారపరీక్షలు చేయించుకుంటే తదనుగుణంగా ఎరువులను వినియోగించవచ్చని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏవో కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహనరావు మాట్లాడుతూ కౌలుదారులకు సాగుహక్కుపత్రాల వలన కలిగే ప్రయోజనాలను వివ రించారు. కార్యక్రమంలో వీఏఏ లీలాసత్య, నాయకులు రావిపాటి సీతయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయసిబ్బంది పాల్గొన్నారు.



కూరగాయాల తోటలను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ



పోటాపోటీగా బారాషహీద్ దర్గా వేలం

- రూ.1.30 కోట్లకు దక్కించుకున్న ముజామిల్

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారాషహీద్ దర్గా నిర్వహణ వేలం పాటలు మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో పోటాపోటీగా జరిగాయి. ముజామిల్ అహ్మద్, టీడీపీ నాయకుడు సాబీర్‌ఖాన్ పోటీ పడ్డారు. చివరకు రూ.1,30,05,500లకు ముజామిల్ అహ్మద్ దర్గా నిర్వహణను దక్కించుకున్నారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి రొట్టెల పండుగ ప్రారంభం నుంచి ఏడాది కాలంపాటు దర్గా నిర్వహణ, మైదానంలో అద్దెల వసూళ్ల హక్కును పాటదారుడు పొందుతారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు అధికారులు పర్యవేక్షించారు.



ధ్వజస్తంభానికి కొడిగుడ్డను కడుతున్న పూజారులు

సకల దేవతల్లారా రారండి!

రామతీర్థంలో వేడుకగా ధ్వజారోహణం

శేషవాహనంపై ఆదిదంపతుల వైభోగం

విడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో తొలి ఘట్టం ధ్వజారోహణ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత గణపతి పూజ, పుణ్యావాహచన, ధ్వజపీట తదితర ప్రత్యేక పూజలను ఆలయ పూజారులు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నందీశ్వరుడి చిత్రాన్ని ముద్రించిన నూతన వస్త్రాన్ని ధ్వజ స్తంభానికి కట్టా, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం పైకి ఎగరేశారు. సంతానం లేని మహిళలకు కొడి ముద్దలను పంచిపెట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, ఈవో మల్లికార్జున రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి శేషవాహనంపై ఆదిదంపతులు కొలువుదీరి భక్తులను కటాక్షించారు. స్వామివారం వాహనం ముందు భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడపాలశ్రీధర్‌రెడ్డి, ఆవుల వాసు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తాతా రమేష్, పొన్నాడి చంద్రశేఖర్, ఆవుల రవి చంద్ర ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



- నేడు అమ్మవారి కల్యాణం, ప్రధానోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 17(ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పేరంటాలమ్మ, గురవయ్యనాయుడు దంపతులు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సంతానంలేని మహిళలు ఉపవాసదీక్షతో వెంగమాంబ పేరంటాలను వరపడి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయం నుంచి నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవారిపాళెం, బీసీ కాలనీల మీదుగా గ్రామోత్సవం సాగింది. తొలుత నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వెంగమాంబ వంశీయులు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేయించారు. స్వామివార్లకు పులివర్తి వంశీయులు పట్టువస్త్రాలను సమర్పించారు. గ్రామోత్సవంలో అమ్మవారి వాహనం వెంట మహిళలు వారుకడవతో నీరు పోసి కాయాకర్పూరం అందచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా బుధవారం వెంగమాంబ దంపతుల కల్యాణం, రాత్రికి ప్రధానోత్సవం జరగనుంది. ఉత్సవాల్లో ప్రధాన రోజులైన బుధ, గురువారాల్లో భారీసంఖ్యలో భక్తులు తరలి రానుండటంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కావలి డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, స్పెషల్, ఏఆర్ పార్టీ పోలీసులతో కలిపి సుమారు 400 మంది బందోబస్తు విధుల్లో ఉంటారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల

పంపిణీ రేపు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను గురువారం పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, రైతులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి మంగళవారం 93 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాంలో ప్రస్తుతం 37.180 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



విద్యాహక్కు చట్టం అడ్మిషన్లు చేపట్టాలని తల్లిదండ్రుల తరఫున పాఠశాల నిర్వాహకులకు వినతిపత్రం ఇస్తున్న సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు

ప్రకటనలేనా... అమలుందా!?

- లోపభూయిష్టంగా విద్యాహక్కు చట్టం నిర్వహణ
- నామమాత్రంగా ఉచిత సీట్ల కేటాయింపు
- కేటాయించింది 576.. ప్రవేశాలు 293
- అడ్మిషన్లు తీసుకున్న వారిపై యాజమాన్యాల ఒత్తిళ్లు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు, తప్పులను ఎత్తి చూపేందుకు రూపుదిద్దుకున్న విద్యాహక్కు చట్టం ఏళ్లు గడుస్తున్నా సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. విద్యను బాలల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ విద్యాహక్కు చట్టం చేశారు. ఉపాధిహామీ పథకం, సమాచారహక్కు చట్టాల తరహాలో ఇది అమలవ్వాలి. 6-14 సంవత్సరాల వయసు కలిగిన బాలలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేరి చదువుకునేలా చర్యలు తీసుకుని వారికి ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని ఈ చట్టం చెబుతోంది. పాఠశాలల్లో చేరని, లేదా మధ్యలో చదువు మానేసిన వీరందరినీ తిరిగి చదువుల బాట పట్టించడం విద్యాహక్కు చట్టం ముఖ్య ఉద్దేశం. అయితే ఈ చట్టం మాత్రం ఎక్కడా అమలు కావడం లేదు.

\- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు కల్పించాల్సిన 25శాతం సీట్లను కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిరాకరిస్తున్నారు. జిల్లాలో తొలివిడతలో 576 ఒకటో తరగతిలో సీట్లు అలాట్‌మెంట్ చేసి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. వీటిలో పలు విద్యాలయాలు పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు పోర్టల్‌లో వివరాలు కూడా నమోదు చేసుకున్నాయి. తొలివిడత ఎంపికైన విద్యార్థులు 8వతరగతి వరకు ఉచితంగా చదువుకునే వెసులుబాటు ఉంది. అయితే నేటికీ 293 అడ్మిషన్లు మాత్రమే పూర్తి కాగా మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కూడా 20 మందికిపైగా తాము ఆయా పాఠశాలల్లో చేరమని రాతపూర్వకంగా రాసిచ్చారు. దీనికి కారణాలు మాత్రం అనేకం ఉన్నాయనే అంటున్నారు. యాజమాన్యాలు తమను చిన్నతనంగా మాట్లాడుతున్నారని, తమపై నిర్లక్ష్యం చూపు తూ గంటల తరబడి పాఠశాలల బయట నిలు చో బెడుతున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు భయపెట్టి మరీ పాఠశాలలో చేరమని రాయించుకుంటున్న సంఘటనలు కూడా జరుగుతుండడం విశేషం. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు తాము సిద్ధమవుతున్నట్లు బాధిత తల్లిదండ్రులు తెలిపారు.

జీవోలు ఏం చెబుతున్నాయంటే..

- **జీవో నెం.1 :** 1994లో ఈ జీఓ విడుదలవగా విద్యార్థుల నుంచి వసూలు చేసే రుసుంలో 50శాతం ఉపాధ్యాయుల వేతనాలు, 15శాతం సాంస్కృతిక కళలు, క్రీడలు, 10శాతం సామగ్రి, 15శాతం సౌకర్యాలు, 5శాతం ఇతర పనులకు ఖర్చుచేయాలి. యాజమాన్యాలు కేవలం 5శాత మాత్రమే లాభాలు తీసుకోవాలి. కానీ జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు.
- **జీఓ నెం.246 :** పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి వారితోనే పర్యవేక్షించాలి. ముఖ్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ద్వారా సమస్యలను యాజమాన్యాలకు తెలియచేసి వాటిని పరిష్కరించాలి. భద్రతా కమిటీ పాఠశాలల బస్సులను తనిఖీలు చేయడం, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడడం వంటివి చేయాలి. కానీ ఇది కూడా ఎక్కడా అమలు కావడం లేదు..
- **జీఓ నెం.42 :** ఈ జీఓ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరి పరిస్థితుల్లో రుసుం పెంచాలనుకుంటే జిల్లా ఫీజు కమిటీ సిఫార్సులు(డీఎఫ్ఆర్‌సీ) అనుమతి పొందాలి. కానీ ప్రతి సంవత్సరం జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులను పెంచి తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి.
- **జీఓ నెం.91 :** దీని ప్రకారం దరఖాస్తు రుసుం రూ.100, రిజిస్ట్రేషన్ రుసుం రూ.500, డిపాజిట్ రూ.5వేలకు మించి ఉండకూడదు. కానీ ప్రాథమిక పాఠశాలల్లోనే వేలల్లో ఫీజులను వసూలు చేస్తున్నారు.
- **జీఓ నెం.91 సెక్షన్ 1సీ:** ఈ జీఓ ప్రకారం పాటశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, యూనిఫాం తదితర విద్యాసామగ్రిని ఉంచకూడదు, అమ్మకూడదు. ఫలానా చోట కొనుగోలు చేయాలని సూచించకూడదు. కానీ ప్రతి పాఠశాలలో కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ వీటిని వ్యాపారం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు

- విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాల కోసం విద్యార్థులకు ఎలాంటి ప్రతిభా పరీక్ష నిర్వహించకూడదు. అయినా జిల్లాలో 50 శాతం పాఠశాలల్లో ప్రతిభా పరీక్షలు జరుగుతున్నాయి. వెనుకబడిన వారి నుంచి అధిక ఫీజులు వసూలు చేసేందుకే ఈ పరీక్షలు పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ విధంగా పరీక్షలు నిర్వహించే యాజమాన్యాలపై విద్యాశాఖ జరిమానాలు విధించాలి. ఇప్పటివరకు ఇలాంటి జరిమానాలు విధించిన దాఖలాలు లేవు.
- ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో తప్పనిసరిగా తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇందులో ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరించాలి. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్నా సమావేశాలపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాత్రం నామమాత్రంగా అమలు చేస్తున్నారు. కొన్నిచోట్ల తల్లిదండ్రులకు తెలియకుండా యాజమాన్యాలు కమిటీలో ఉన్నట్లు పేర్లు సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులందరికీ న్యాయం

ప్రాథమిక విద్యాహక్కు చట్టం కింద ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25శాతం సీట్లు కేటాయించాము. ప్రవేశాలకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. గడిచిన మూడేళ్లలో ఉన్న బకాయి ఫీజులతోపాటు ఈ ఏడాది ఫీజులు కూడా చెల్లించాలని ఆయా యాజమాన్యాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. పాత బకాయిల చెల్లింపు, కొత్త ఫీజులు వర్తింపునకు సంబంధించి త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల నివేదిక ఆధారంగా ఫీజులన్నీ చెల్లించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తాము.

\- డాక్టర్ బాలాజీరావు, డీఈవో



ఆక్రమణలతో కుంచించుకుపోయి, పిచ్చిచెట్లతో నిండిన గచ్చు కాలువ

ముంపు.. ముప్పు తప్పేనా!?

- నెల్లూరులోని కాలువలు బాగుపడేనా?
- 2018లో మొదలైన ఆధునికీకరణ పనులు
- వైసీపీ హయాంలో పనులకు బ్రేకులు
- తాజాగా రూ.176 కోట్లతో అంచనాలు

8

2015లో జరిగిన విధ్వంసం గుర్తుందా!?. ఎడతెరిపిలేని వర్షం కురవడంతో నెల్లూరు నగరం మొత్తం నీట మునిగింది. నగరం నుంచి నీటిని బయటకు పారించేందుకు అప్పట్లో ఎంత శ్రమ పడాల్సి వచ్చిందో నగరవాసులుకు తెలియనిది కాదు. నాటి పరిస్థితి మరోసారి పునరావృతమైతే ఏమిటి పరిస్థితి?. తలుచుకుంటేనే ఒళ్లు గగురుపుడుస్తుంది. నగరం మరోసారి వరద ముంపునకు గురికాకుండా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రధాన కాలువల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. కొన్ని కాలువలకు లైనింగ్ కూడా చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పనులకు బ్రేకులు పడ్డాయి. అయితే ఇప్పుడు మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నగర ప్రజలంతా కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా రూ.176 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



మృతులు వెంకటేశ్వర్లు, స్వర్ణలత (ఫైల్)

నాలుగు రూకలు సంపాదించుకుంటే తప్ప వారి నోట్లోకి ముద్ద వెళ్లలేని పరిస్థితి. వయసు పైబడిన ఆ దంపతులు ఏ పని చేయలేక జాతీయ రహదారి పక్కనే చిన్న దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. అలాంటి వారిపాలిట ఓ మినీ ట్రక్కు మృత్యువుగా మారింది. దుకాణంలో ఉన్న వారిపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దుత్తలూరు మండలంలో మంగళవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.

దూసుకొచ్చిన మృత్యువు

- దుకాణంలోకి చొచ్చుకెళ్లిన మినీ ట్రక్కు
- డ్రైవర్ నిద్రమత్తే కారణం?
- దంపతుల మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన పరుశుబోయిన వెంకటేశ్వర్లు (65), స్వర్ణలత (63) ఎస్సీ కాలనీ సమీపంలో హైవే పక్కన దుకాణం పెట్టుకుని ఉన్నారు. నర్రవాడ నుంచి పూల కోసం ఓ మినీ ట్రక్కు ఆత్మకూరుకు బయలుదేరింది. ఎస్సీ కాలనీ సమీపానికి ట్రక్కు రాగానే డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం కారణంగా వాహనం అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌కు 20 అడుగుల దూరంలో ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో దుకాణంలో ఉన్న వెంకటేశ్వర్లు, స్వర్ణలతపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ట్రక్కులో ఉన్న సుమంత్ అనే వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆయన్ను 108 వాహనంలో దుత్తలూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతుల మృతితో గ్రామంలో విషాదం నెలకొనడంతోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన మినీ ట్రక్కు

ప్రమాదశాత్తు పడి..

సీతారామపురం : ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి 108 అంబులెన్స్ ఉద్యోగి మృతి చెందాడు. సీతారామపురంలోని రాజుగారివీధికి చెందిన ఓంకారం వెంకటనారాయణ రాజు (38) స్థానిక పీహెచ్సీలోని 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి డ్యూటీ ముగించుకుని మంగళవారం ఉదయాన్నే ఇంటికి వచ్చాడు. సమీప బంధువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆటోలో ఉదయగిరి బయలుదేరారు. ఈ క్రమంలో బసినేనిపల్లి గ్రామం సమీపాన నిద్రమత్తులో ఆటో లో నుంచి వెంకట నారాయణరాజు కింద పడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఉదయగిరిగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు చిన్న కుమార్తెలు ఉన్నారు. ఉద్యోగ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ అందరితో సౌమ్యుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి అకాల మరణంతో అందరినీ శోకసంద్రంలో ముంచెత్తింది.



వెంకటనారాయణరాజు మృతదేహం

రైలుపట్టాలపై వేర్వేరు చోట్ల...

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని రైలు పట్టాల పక్కన వేర్వేరు ప్రాంతాల్లో రెండు పురుష మృతదేహాలను గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్‌కు ఉత్తరాన దిగువ లూప్‌లైన్ యాడ్ 202/10-12 కిలోమీటర్ల వద్ద 45ఏళ్ల వయసు గల పురుష మృతదేహం గుర్తించామన్నారు. పూర్తి చేతుల బులుగు రంగు జీన్స్ షర్టు, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతిపై బిందుశ్రీ అని టాటూ మార్క్ ఉందని, ఎడమ చేతిపై అమ్మ అనే టాటూ, రెండు వైపులా సిలువ గుర్తులు ఉన్నాయని అన్నారు. ఛాతీపైన కళ్యాణి అనే టాటూ మార్క్ ఉన్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. అల్లూరురోడ్డు తలమంచి రైల్వే స్టేషన్ల మధ్య 195/9-11 కిలోమీటర్ల మధ్య సుమారు 36 ఏళ్ల వయసు గల పురుష మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడి వద్ద లభించిన పాన్‌కార్డును బట్టి త్రిపుర రాష్ట్రానికి చెందిన జిబిట్వా బన్నా చక్మగా అని ఉందన్నారు. రెండు మృతదేహాలను కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బావిలోపడి బాలిక..

వెంకటాచలం : అనికేపల్లి పంచాయతీ రామాపురం గిరిజన కాలనీ పక్కనే ఉన్న బావిలో పడి ఒక బాలిక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... ఏకసిరి పోలయ్య కుమార్తె శ్రీవల్లి (9) గొలగమూడిలోని పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. బావి వద్ద ఆడుకుంటూ ప్రమాద వశాత్తు జారి బావిలో పడి మృతి చెందింది. స్థానికులు గుర్తించి ఆ బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. చలనంలేని బిడ్డను చూసి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో

రూ.24 లక్షలు దోచేశారు!

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.24 లక్షలు కాజేశారు. దీనిపై నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని డైకాస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన ఎం లక్ష్మీనరసింహం అనే వ్యాపారికి ఈ నెల 10వ తేదీన ఓ మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ అధికారునంటూ పరిచయం చేసుకుంది. మానవ అక్రమ రవాణా చేసే సాదర్ ఖాన్‌ను కర్ణాటక పోలీసు లు అరెస్ట్ చేశారని అతని బ్యాంకు ఖాతా నుంచి మీ అకౌంట్‌కు రూ.30 లక్షలు బదిలీ అయినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని బెదిరించింది. శివప్రసాద్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వస్తుందని తెలిపింది. కొద్దిసేపటికే శివప్రసాద్ అనే వ్యక్తి వీడియో కాల్ చేసి తాను సీబీఐ అధికారిని అంటూ మాటలు కలిపి డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని చెప్పారు. ఆ తర్వాత రెండు దఫాలుగా లక్ష్మీనరసింహం ఖాతా నుంచి రూ.24,20,100 నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహమ్మదాపురం ప్లాంటు వద్ద కేంద్ర బృందం

నీటి నిర్వహణ ఎలా!?

నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో రెండు రోజులుగా కేంద్ర జల వనరుల శాఖకు చెందిన ఓ బృందం పర్యటిస్తోంది. మంగళవారం మహ్మదాపురంలోని తాగునీటి శుద్ధి ప్లాంటు, సరఫరా విభాగాలను బృంద సభ్యు లు పరిశీలించారు. అక్కడ నుంచి నగరానికి చేరుతున్న నీటి పంపింగ్ వ్యవస్థను పర్యవేక్షించారు. అనంతరం నగరంలోని నీటి పొదుపునకు తీసుకుంటున్న చర్యలు, భూగర్భ జలాల వృద్ధికి కార్పొరేషన్ నిర్వహిస్తున్న ప్ర ణాళికలు, తాగునీటి సరఫరా, వాటర్ ట్యాంకుల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి తయారీ ప్లాంటు తదితర వాటిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వీటన్నిటిపై నివేదిక తయారు చేసి, కేంద్రానికి అందజేస్తామని బృందంలోని సభ్యులు ప్రదీప్‌కుమార్, రాంబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ చర్యలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

- అధునాతనంగా పొదలకూరు బస్టాండు నిర్మాణం
- ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సురేష్‌రెడ్డి వెల్లడి

\- వివరాలు 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కొండాపురం (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు మంగళవారం తహసీల్దార్ కోటేశ్వర రావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు తక్ష ణమే పేస్కేలును అమలు చేయాలన్నారు. అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్‌వోలుగా ప్ర మోషన్లు ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియ మించాలన్నారు. అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70 శాతం వరకు పెంచాలన్నారు. తమకు కేటాయిస్తున్న అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు.



తహసీల్దార్‌కి వినతిపత్రం అందచేస్తున్న వీఆర్ఏలు

న్యూస్ బాక్స్

వైభవంగా పోలేరమ్మకు మాస పొంగళ్లు



పోలేరమ్మకు నిర్వహించిన పూలంగిసేవ

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని పోలేరమ్మకు ఉత్సవాల అనంతరం మాస పొంగళ్ల కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. త్రిపురా కన్‌స్ట్రక్షన్ అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు అభిషేకాలు, ప్రత్యేక పూలంగిసేవ, అన్నసంతర్పన ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మకు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా అర్పించారు. ఈ కార్యక్రమంలో పసులేటి వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ దంపతులతోపాటు పెద్ద కాపు జనార్దన్‌రెడ్డి, కమిటీ సభ్యులు గుంజి వెంకటేశ్వర్లు, కడియాల వెంకయ్య, పీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు లోగ్రేడ్ క్వింటా రూ. 20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని తెలుగురైతు మండల ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మీనరసింహం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అసలే ఈ ఏడాది అధిక వర్షాలు వలన తెగుళ్ల వ్యాప్తి చెంది నాణ్యమైన పొగాకు దిగుబడులు రాలేదని తెలిపారు. అంతేకాక ఇబ్బడిముబ్బడిగా ఖర్చులు పెరిగిపోయాయని ఆయన తెలిపారు.ఈ తరుణంలో పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

121 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 510పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 389బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-94, ఆర్ఆర్-11, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 121బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.252.17గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యామిత్ర కిట్లను పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు కూచిపూడి విజయ్‌కుమార్ తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్, ఎంఈవో మల్లికార్జునరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతు సదస్సును విజయవంతం చేయండి

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే. వీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులకు గిట్టుబాటు ధరల కల్పన కోసం వివిధ రైతుసంఘాలు, రైతులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

లింగసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ హాజరవుతారని ఆమె చెప్పారు. భూసమస్యలతోపాటు ఇతర సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మండల అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె వివరించారు.

పంటలు సాగయ్యాక భూసార పరీక్ష ఫలితాలా ?

● ప్రతిఏటా ఇదే తంతు ● నష్టపోతున్నరైతులు

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. నేల స్వభావం, అందులో ఏ స్థాయిలో ప్రథమ పోషకాలు ఉన్నాయి. ద్వితీయ పోషకాలు ఎలా ఉన్నాయి. సూక్ష్మపోషకాలు ఎంత ఉన్నాయి. భూమిలో ఉన్న పోషక విలువలు గురించి రైతులకు తెలియజేసి ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించి, ఖరీఫ్‌లో పంటల సాగుకు రైతులను వ్యవసాయాధికారులు సిద్ధం చేయాలి. సాధారణంగా ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్, నెలల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరిస్తారు. ఈ ఏడాది కూడా అలాగే మట్టి నమూనాలను సేకరించారు. కానీ ఖరీఫ్ ప్రారంభ అయినా కూడా ఇంత వరకూ భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మాత్రం రైతులకు ఇవ్వలేదు. టెస్టింగ్ కోసం మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించే సరికి ఖరీఫ్ సీజన్ పూర్తి అయిపోయి రబీ సీజన్ కూడ ప్రారంభం అవుతుంది. వలేటివారిపాలెం మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 738 మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అయితే ప్రతి ఏటా పంటలు సాగు చేసిన తరువాత మట్టి నమూనా పరీక్ష ఫలితాలు వస్తున్నాయి. ఈ పరీక్ష ఫలితాల కోస రైతులు ఎదురుచూడకుండా తమకు అవగాహన మేరకు పంటలు సాగు చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే ఫలితాలను ఇస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.



కొండసముద్రంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖాధికారులు (ఫైల్)

ఫలితాలు రాగానే అవగాహన కల్పిస్తాం



మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 738 మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. ఫలితాలు వచ్చిన వెంటనే రైతులకు పంటలు, ఎరువులపై అవగాహన కల్పిస్తాం. త్వరలోనే ఫలితాలు వస్తాయి.

- శేషారెడ్డి, ఏవో

నాడు నిర్లక్ష్యం.. నేడు బాధ్యతాయుతం !

● ధ్వంసం చేసిన కలుజు గోడ పునఃనిర్మాణంతో రైతుల హర్షం





వైసీపీ హయాంలో పగలగొట్టిన చెరువు కలుజు గోడ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పునర్‌నిర్మించిన చెరువు కలుజు గోడ

అల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో కొంతమంది నాయకులు స్వార్థంతో అల్లూరు చెరువు రెండో లెవల్ కలుజు గోడను ధ్వంసం చేశారు. చేపలు పట్టుకొని లాభార్జన పొందాలనే కారణంతో నిండుకుండలా తొణికిసలాడే చెరువులో నీటి మట్టాన్ని తగ్గించేందుకు ఈ కలుజు గోడను ధ్వంసం చేశారు. దీనిపై గతంలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు బీద గిరిధర్ సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు అవసరమయ్యే చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా కలుజు గోడను మంగళవారం పునఃనిర్మించారు. దీంతో 8.2 అడుగుల నీటి మట్టం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ఆయన చర్యలు తీసుకున్నారు.

టీడీపీ నేతకు పలువురి నివాళి



నాగేశ్వరరావు, ఖాదర్‌బాషా చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్, జర్నలిస్టులు

కావలి,జూన్17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష పార్థివదేహానికి మంగళవారం ఇస్లాంపేటలోని ఆయన ఇంటివద్ద, పలువురు నివాళులు అర్పించారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో పలువురు నాయకులు నివాళులు అర్పించారు. ఖాదర్‌బాష రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, బొట్లగుంట శ్రీహరినాయుడు, శానం హరి అర్షియాబేగం,రఫీ, కిరన్, రహీం, మస్తాన్, నారాయణ , నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ ఏరియావైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ నేత ఖాదర్‌బాషతోపాటు సోమవారం మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు చిత్రపటాలను ఏర్పాటుచేసి సంతాప సభ నిర్వహించారు. ఈ శిబిరంలో ఫొటోగ్రాఫర్స్, పలువురు జర్నలిస్ట్‌లు, పట్టణ ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు. అలాగే జర్నలిస్ట్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించి, నివాళులు అర్పించారు.

లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి



కందుకూరులో పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, రైతు సంఘాల నేతలు

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధరకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి కొనుగోళ్లు చేయించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, రైతుసంఘాల నేతలు డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య, సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య, స్థానిక రైతుసంఘాల నేతలు మంగళవారం కందుకూరులోని వేలం కేంద్రాలను సందర్శించారు. వేలం తీరును పరిశీలించారు. అనంతరం పామూరురోడ్డులోని కందుకూరు 2 వేలం కేంద్రంలో రైతుసదస్సు నిర్వహించారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో మూలే వెంగయ్య మాట్లాడుతూ గరిష్ఠ ధర రూ. 280 చూయిస్తున్నప్పటికీ లోగ్రేడ్‌లను రూ. 180కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో సరాసరి ధరలు దారుణంగా పడిపోతూ రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య తదితరులు మాట్లాడారు. సదస్సులో రైతుసంఘాల నాయకులు కే. వీరారెడ్డి, ఎస్ఏ గౌస్, జీ. వెంకటేశ్వర్లు, బీ. సురేష్‌బాబు, తానికొండ రమణయ్య, జీవీబీ కుమార్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై విజయనగరం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్రమంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఇంటూరి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వివిధ కమిటీలు ఏర్పాటుచేయగా అందులో ఎమ్మెల్యే ఇంటూరి కూడా సభ్యుడిగా ఉన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

కావలి రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐకాన్ సెంటర్ వద్ద ఇటీవల జరిగిన ఆత్మీయ సమావేశం లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పై ప్లెక్సీల విషయం లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన దామెర్ల శ్రావణ్ కుమార్‌ను మంగళవారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గౌస్ బాష ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చగా, ఈ నెల 30 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

మలేరియా నిర్ధారణకు రక్తనమూనాలు సేకరించాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ



దోమల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధిని నిర్ధా రించేందుకు జ్వరపీడితుల రక్త నమూనాలను సేకరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదే శించారు. మంగళవారం నగరంలోని పడారు పల్లి, అనగుంట పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఏఎన్‌ఎంలు జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరిస్తు న్నారా?, వాటిని ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షిస్తున్నారా? అని ప్రశ్నించారు. లార్వా, ఫీవర్ సర్వేల తీరును పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దోమల వల్ల అనేక ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సచివాలయం ఏఎన్‌ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి







కందుకూరు : పలుకూరులో మాట్లాడుతున్న ఏడీఏ అనసూయ, ఉలవపాడు : రైతులతో మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్, గుడ్లూరు : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రవికుమార్

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) పచ్చిరొట్ట విత్తనాలను రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేనిచెరువు, అంకభూపాలపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పచ్చిరొటట్ట విత్తనాలయిన జీలుగ, జనుము, పిల్లిపిసర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచిరొట్ట విత్తనాల వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహయకులు నాగరాజు, రవీంద్ర, ప్రభు పాల్గొన్నారు.

● **కందుకూరు** : అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు బదిలీ జరుగుతుందని ఏడీఏ వీ. అనసూయ తెలిపారు. మండలంలోని పలుకూరు, పందలపాడు గ్రామాల్లో మంగళవా రం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏవో అ బ్దుల్‌రహీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏడీఏ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన రైతులందరినీ లబ్ధిదారులుగా నమో దు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేర కు నగదుసహాయం ప్రతిరైతు పొందుతార న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకు లు, రైతులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : ఎడ గారులో ఎరువుల నియత్రణ విధిగా పాటించా లని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పా ల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● **ఉలవపాడ** : ఖరీఫ్‌లో పచ్చిరొట్ట పైర్ల సాగుకు ప్రస్తుత వాతా వరణం అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌కుమార్ రైతు లకు సూచించారు. ఉలవపాడు సచివాలయం 1,2 రైతు సేవా కేంద్రం పరిధిలోని కొల్లా రుపాడు, రాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు దున్నుకొని పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాల న్నారు. విత్తనాల కోసం రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నెంబరుతో దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి పర్మిట్లు రాయించుకోవాలని ఏవో తెలిపారు.

● **గుడ్లూరు** : అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిపొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవాలని మండల ఏవో రవికుమార్ మంగళ వారం తెలియజేశారు. మండలంలోని పరకొండ పాడు అగ్రహారంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఏవో మా ట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అ ర్హులైన రైతుల జాబితా సచివాలయ కేంద్రాల్లో ఉంచామన్నారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులకు అన్నదాత సుఖీభవ వర్తించదని పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకుల తోపాటు, వ్యవసాయ సహాయకులు అనిల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

గేటు లేక మందుబాబుల సంచారం



మంచినీటి ట్యాంకు చుట్టూ గేటు లేని ప్రహరీ

లింగసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంకు చుట్టూ ఉన్న ప్రహరీ గోడకు గేటు లేదు. దీంతో ఇది మందుబాబులకు నిలయంగా మారింది.ఈ ట్యాంకు వద్ద ప్రతిరోజూ కొందరు ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. దీంతో పగిలిన గాజు ముక్కలు నీటిని విడుదల చేసే వారికి గుచ్చుకొంటున్నాయి. అధికారులు స్పందించి గేటు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు



వాకమళ్లవారిపాలెం ఆనకట్ట వద్ద ధ్వంసమైన ఆర్అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై తారు, మెటల్ లేచిపోయి గుంతలు పడి దారుణంగా తయారైంది.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ రోడ్డుపైన గుంతలు పెద్దవై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణం కోసం వినతి

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అరుంధతీవాడలో రేషన్ షాప్ కోసం జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరుంధతీవాడలో 300లకుపైగా కుటుంబాలు ఉన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ధ్యేయం



మాట్లాడుతున్న బ్రహ్మానందం

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో నారాయణ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించామని షిరిడీ శేషసాయి మందిర వ్యవస్థాపకుడు కే. బ్రహ్మానందం అన్నారు. బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకా నగరులోని శేషసాయి మందిరం ఆవరణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ వైద్యశాల వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిమందిర సేవకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ వద్ద మరమ్మతులు.. ఆగిన రాకపోకలు



రైల్వే ట్రాక్ అండర్ పాస్ వద్ద చేస్తున్న మరమ్మతులు

కావలి, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద రైల్వే ట్రాక్ కింద అన్నపుగుంటలో నుంచి పాపిరెడ్డి చెరువులోకి వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసి ఉన్న అండర్‌పాస్ వద్ద మంగళవారం మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఆటంకం ఏర్పడింది. మురుగునీరు పైన పారకుండా ఉండేలా దాని కింద పైపులైను వేసే కార్యక్రమం చేపట్టారు. పైపులు వేసేందుకు తవ్వుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి.

రోడ్డు వెంబడి వాహనాలు!

● ప్రజల రాకపోకలకు ఇక్కట్లు



ఆర్వోబీ వంతెన కింద మరమ్మతుల కోసం వచ్చిన మోటారుసైకిళ్లు

కావలి,జూన్17(ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్వోబీ వంతెనకు ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్ల వెంబడి మోటారుసైకిల్ మెకానిక్ షాపులు ఏర్పాటు చేశారు. ఆ షాపుల వద్దకు మరమ్మతుల కోసం వచ్చిన మోటారుసైకిళ్లను వంతెన కిందనే కాకుండా దాని వెంబడి ఉన్న సర్వీస్ రోడ్లలో కూడా పెడుతున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ముఖ్యంగా ప్రైవేట్ వైద్యశాలలు అన్నీ ఆ ప్రాంతంలో ఉండటంతో రోడ్లపై ఉన్న మోటారు సైకిళ్లతో రాకపోకలకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ ఆక్రమించినా మున్సిపల్ అధికారులుకాని, పోలీస్‌లు కాని పట్టించుకోవటంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మోటారుసైకిళ్లతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

కొడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగడిచెలిక పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై డీఎల్‌పీవో వెంకట్ మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రేగడిచెలిక పంచాయతీలో పారిశుధ్యం, రోడ్ల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అభియోగంపై రికార్డులు పరిశీలించామని, ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు, తదితరులు ఉన్నారు.

పాటూరులో 'వీరులదిబ్బ'

కాపాడాలని ప్రభుత్వానికి ప్రజల విన్నపం



ఖడ్గతిక్కన జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన శిల

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కన సోదరుడు ఖడ్గ తిక్కన. నెల్లూరు రాజధానిగా మనుమసిద్ధి రాజ్యంలో సర్వసైన్యాధిపతిగా సేవలందిస్తూ చాగలికొండ సమీపంలో 1260వ సంవత్సరంలో కాటమరాజు సైన్యంతో జరిగిన పోరులో వీరత్వం పొందారు. ఆయన మృతదేహాన్ని పంచకళ్యాణి గుర్రం పాటూరు గ్రామ పొలిమేరకు తీసుకువచ్చింది. కొంత మంది వీరుల మృతదేహాలతో కలిపి ఖడ్గతిక్కనను ఇక్కడే ఖననం చేశారు. ఖడ్గతిక్కన భార్య చానమ్మ సతీసహగమనం చేశారని చరిత్రకారులు చెబుతారు. మృతదేహాల్ని ఖననం చేసిన ఈ ప్రాంతాన్ని వీరులదిబ్బగా పిలుస్తుంటారు. ఇప్పటికీ ఖడ్గ తిక్కనను స్మరిస్తూ పలువురు పాటూరు రైతులు ఈ శిలలకు పూజలు చేస్తుంటారు. గత చరిత్రకు చెందిన ఆనవాళ్లు నేటికీ మిగిలి ఉన్నాయి. శిలల చరిత్ర, చారిత్రక ఆనవాళ్లు సమాధి కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

మార్చి వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సాపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సాపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.



హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలి

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తమ హక్కుల కోసం కార్మికులు కలిసికట్టుగా పోరాడాలని జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వ రరావు అన్నారు. బోగోలు మండల సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆహ్వానం మేరకు కప్పరాళ్ళతిప్ప గోదాములో ము ఠాకార్మికులతో మంగళవారం సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడాలంటే సంఘంగా ఏర్పడి ఐక్యతతో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హమాలీ కార్మికుల సంఘం నాయకులు అజయ్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రెహనాబేగం, సీపీఎం నేత తుమ్మల వెంకయ్య, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి పాల్గొన్నారు.

గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలకు

ఘనంగా అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్న పండితులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంగణంలో ఉన్న గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమ య్యాయి. ఉదయం మహాలక్ష్మీ, గోదాదేవి సమేత మహావిష్ణు స్వామికి అష్టోత్తర శత కలిశాలతో అభిషేకం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం అంకురార్పణ, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ కార్యక్రమాలు జరిగాయి. భద్రాచలం సీతారామస్వామి దేవస్థానం ఆస్థాన ఆచార్యులు కోమండూరు ఇళాయవల్లి స్థలశాయి స్వామి ఆధ్వర్యం లో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉభయకర్తలుగా మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఉషమ్మ దంపతులు, బొందల నరసింహారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కే శ్రీనివాస్, రాధమ్మ దంపతులు వ్యవహరిం చారు. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పీటీ జగన్నాథం, కేజీ శంకరన్, తదితరులు పర్యవేక్షించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడులు సాధించవచ్చని మండల ఏవో శైలజాకుమారి తెలిపారు. మంగళవారం సోమశిల, పీకేపాడు గ్రామాల్లో రైతులతో ప్రతేక సమావేశం నిర్వహించి విత్తనశుద్ధి, పచ్చిరొట్ట సాగుతో కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తనకు

ఏడాది జైలు శిక్ష

ముత్తుకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి, దాడి చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు స్పెషల్ రైల్వే కోర్టు న్యాయాధికారి పాలమంగళం వినోద్ మంగళ వారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ముత్తుకూరు వెలుగు కార్యాలయంలో 2021వ సంవత్సరంలో వీఏవోగా పని చేస్తున్న మహిళపై మామిడిపూడి గ్రామస్తుడు పేటా నాగార్జున అసభ్యంగా ప్రవర్తించి దాడి చేశాడు. ఈ ఘటనపై ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నాగార్జునకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ లీలాకుమారి వాదించారు. సాక్షులను కోర్టులో హాజరు పరచడంలో ప్రతిభ కనపర్చిన ముత్తుకూరు ఎస్ఐ పీ విశ్వనాథ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ షేక్ ఖాదర్ మస్తాన్‌ను ఉన్నతాధికా రులు అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన భర్తను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే సాంబ శివరావు మంగళవారం మీడియాకు వివ రాలు వెల్లడించారు. బాలాజీనగర్ వైకే ఆచారి స్కూలు వీధిలో ఎల్ విజయ్‌చంద్ర, శైలజ(46) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. విజయ్‌చంద్ర ట్రెజరీ కార్యాల యంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శైలజ తండ్రి చెన్నైలో ఉంటూ మృతి చెందారు. ఆయనకు చెందిన ఆస్తులు తమకు రావాలంటే కొంత నగదు ఖర్చు చేయాలని భర్తకు శైలజ చెప్పింది. అతని అంగీకారంతో కోర్టులో కేసు వేసి భర్తతో రూ.40 లక్షలకుపైగా అప్పు చేయించింది. ఈ అప్పుల కారణంగా విజయ చంద్ర పిల్లల ఫీజులు కట్టలేకపోయారు. ఇదిలా ఉండగా భర్తపై శైలజ అనుమానం పెంచుకుంది. ఆయన విధులకు వెళ్లినా వీడి యోకాల్ చేసి వేధించేది. తరచూ భర్తతో గొడవపడుతూ ఉండేది. దీంతో ఎందుకలా చేస్తున్నావని కుమారులు కూడా తల్లిని ప్రశ్నించేవారు. భార్య వేధంపులు తాళలేక ఆమెను అంతమొందించాలని విజయచంద్ర నిర్ణయించుకున్నారు. ఈ నెల 14వ తేదీ పిల్లలిద్దరిని భోజనం తీసుకురావాలని బయటకు పంపారు. పథకం ప్రకారం రోకలి బండతో బలంగా తలపై కొట్టాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత పరారయ్యాడు. పెద్దకుమారుడు శ్యామ్ సాత్విక్ ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు విజయచంద్రను సోమవారం ఇన్‌స్పెక్టర్ సాంబశివ రావు అరెస్ట్ చేశారు.

ముంపు.. ముప్పు తప్పేనా!?

- నెల్లూరులోని కాలువలు బాగుపడేనా?
- మోస్తరు వర్షానికే మునిగిపోతున్న ప్రాంతాలెన్నో
- కాలువలు ఆక్రమణలకు గురవడమే కారణం
- 2018లో మొదలైన ఆధునికీకరణ పనులు
- వైసీపీ హయాంలో పనులకు బ్రేకులు
- తాజాగా రూ.176 కోట్లతో అంచనాలు

నెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో నగరం మీదుగా వెళ్లే అనేక కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోయాయి. కృష్ణపట్నం కాలువ హరనాథపురం వద్ద సర్వేపల్లి కాలువ నుంచి ప్రారంభమై కాకుపల్లి వరకు వెళుతుంది. సర్వేపల్లి కాలువలోని నీటిని ఈ కాలువ తీసుకెళుతుంది. నీలగిరి సంఘం నుంచి ప్రారంభమయ్యే పీటర్స్ కాలువ ఇస్కాన్ సిటీ వరకు ఉంటుంది. ఈ కాలువను ఇరువైపులా ఆక్రమించి భవనాలు నిర్మించారు. చాలా చోట్ల పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయింది. పూర్తిస్థాయిలో నీరు పారలేని దుస్థితిలో ఉంది. కంబాల కాలువ నవబాలదుర్గాదేవి ఆలయం నుంచి నారాయణరెడ్డిపేట వరకు సాగుతుంది. ఇది పూర్తిగా రూపుకోల్పోయింది. ఇక లోలెవల్ కాలువ బెడ్ ఏడు మీటర్లు ఉండాల్సిందిగా రెండు మీటర్లకు కుచించుకుపోయిందని గతంలో అధికారులు తేల్చారు. దీంతో ఆశించిన స్థాయిలో ఈ కాలువ గుండా నీరు పారలేని పరిస్థితి. ఉయ్యాల కాలువ పరిస్థితి కూడా అంతే. కనుపూరు కాలువ బ్రాంచి కెనాల్‌ను ఆక్రమించి భవనాలు నిర్మించారు. ఇవే కాదు ప్రధానమైన రామిరెడ్డి కాలువ, వెంగన్న కాలువలు కూడా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ కారణాల వల్లే నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఎక్కడికక్కడ నిలబడిపోతోంది.

● నాడు రూ.82 కోట్లతో పనులు

నగరంలో 13 ప్రధాన కాలువలు ఉన్నాయి. ఇవన్నీ నెల్లూరు చెరువు నుంచి గ్రామీ ణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తుంటాయి. అయితే కొన్నేళ్ల నుంచి నగరం క్రమేణా విస్తరిస్తుండటంతో వ్యవసాయ భూములు కూడా నివాస ప్రాంతాలుగా మారిపోతూ వస్తున్నాయి. దీంతో ఈ కాలువల్లో కొన్ని డ్రైనేజీ కాలువలుగా మారిపోయాయి. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీటిని నగరం వెలుపలకు తీసుకెళ్లాల్సినవి ఈ కాలువలే. వీటిలో ముఖ్యమైన రామిరెడ్డి కాలువ, కాకుపల్లి కాలువ, గుండ్లపాలెం కాలువ, లోలెవల్ స్లూయిజ్ కాలువ, వెంగన్న కాలువ, స్లూయిజ్ కాలువలను అభివృద్ధి చేసేందుకు 2018లో టెండర్లు పిలిచారు. సుమారు రూ.82 కోట్లతో కాలువలో బెడ్ నిర్మించడం, రెండు వైపులా లైనింగ్ ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి. రామిరెడ్డి కాలువ, వెంగన్న కాలువల్లో కొంత మేర పనులు కూడా జరిగాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు నిలిచిపోయాయి.



వాకర్స్‌రోడ్డులోని కాలువ దుస్థితి

రూ.176 కోట్లతో అంచనాలు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ప్రధాన కాలువలకు లైనింగ్, బెడ్ నిర్మించి ఆధునీకీకరించేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు అంచనాలు రూపొందించారు. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో సుమారు 50 కిలోమీటర్ల మేర కాలువలను బాగు చేసేందుకు రూ.176 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఇంత మొత్తం మున్సిపల్ శాఖ నుంచి ఇవ్వడం కష్టమని భావించి రూ.50 కోట్లతో 14 కి.మీ మేర పనులను ఇరిగేషన్ శాఖ ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపింది. మిగిలిన నిధుల కోసం మున్సిపల్ శాఖకు ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రస్తుతం ప్రభుత్వ స్థాయిలో ఈ ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సీహెచ్‌సీలో విచారణ

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అల్లూరు వైద్యుడు వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. వైద్యశాలలో పని చేసే ఒక డాక్టర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఆరోపిస్తూ ఈనెల 11న కుటుంబ సభ్యులు దాడికి ప్రయత్నించారు. మరుసటిరోజే బాలిక కుటుంబ సభ్యులు డాక్టర్‌ను అపార్థం చేసుకున్నామని, అసభ్యకరంగా ప్రవర్తించలేదని క్షమాపణ కోరారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని ఆదేశించడంతో డాక్టర్ వెంకటేశ్వర్లు విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు.



ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలిస్తున్న సీఐ గంగాధర్

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఇటీవల వరుస ప్రమాదాల నేపథ్యంలో ప్రమాద నివారణ చర్యలు తక్షణమే తీసుకోవాలని రాష్ట్ర మంత్రి రామనారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. దీంతో పోలీసు లు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఇరువైపులా ప్రమాదాల నివారణకు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ జీ. గంగాధర్ బారీకేడ్స్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే డేంజర్ స్పాట్స్ దగ్గర ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బోర్డుల ఏర్పాటుతో వాహనాల వేగం తగ్గి నిదానంగా వెళ్లడంతో ప్రమాదాలు అరికట్ట వచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

గుళికలు తిని బాలిక ఆత్మహత్యాయత్నం

వెంకటాచలం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంగుంట ఎస్టీ కాలనీలో ఓ బాలిక గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు... తనకు ఇష్టంలేని పెళ్లి చేశారన్న మనస్థాపంతో నాలుగు రోజుల క్రితం ఓ బాలిక గుళికలు తిన్నది. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించి, వైద్యం చేయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రి స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం కొండపై మంగళవారం పోలీసు, అటవీ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించి పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి దుర్గంపైగల పెద్దమసీదు వద్ద నిద్రించేందుకు వెళ్లారు. ఆ సమయంలో రామ్, కరీం బుగ్గ ప్రాంతంలో దీపాలు వెలుగుతుండడం, వ్యక్తుల సంచారం ఉండడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. తిరిగి ఆదివారం పట్టణానికి వస్తూ రాత్రి దీపాలు వెలుగుతున్న, వ్యక్తుల సంచార ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జిలిటెన్ స్టిక్స్ ఇతరత్రా వస్తువులు ఉండడాన్ని గుర్తించి పరుగులు తీశారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో పాటు పట్టణంలో ప్రచారం జరిగింది. దీంతో మంగళవారం పోలీసు, అటవీ శాఖాధికారులను ఆ యువకులు వెంటబెట్టుకుని దుర్గంపై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గుప్తనిధుల తవ్వకాల కోసం ఉంచిన 14 జిలిటెన్ స్టిక్స్, బ్యాటరీ, వైర్లు, ఇతరత్రా పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

● అధునాతనంగా పొదలకూరు బస్టాండు నిర్మాణం ● రీజియన్ చైర్మన్ సురేష్‌రెడ్డి వెల్లడి



పొదలకూరు బస్టాండును పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి తదితరులు

పొదలకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు త్వరలో 300 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆ సంస్థ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం పొదలకూరులోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాపూరు డిపో మేనేజరు అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పొదలకూరు బస్టాండ్ ప్రాంగణాన్ని 15 ఏళ్లపాటు ఓఎస్ కింద లీజుకు ఇచ్చామని, ఇందులో భాగంగా భవనానికి రంగులు వేయడంతోపాటు మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రయాణికులకు వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు. బస్టాండ్‌లో సిమెంటు ప్లాట్‌ఫారం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కాగా పొదలకూరు నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు బస్సులను నడపాలని, అలాగే తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల లోపల నెల్లూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పలువురు సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్వేపల్లి ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, నాయకులు సుబ్రహ్మణ్యం, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ వద్దు

● పేద, మధ్య తరగతికి వైద్య విద్య దూరం
● ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతనంగా రూపుదిద్దుకుంటున్న 17 వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని, ఇది ప్రజారోగ్యానికి హాని కలిగిస్తుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగ స్వామ్యం (పీపీపీ) విధానంలో కొత్త వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇది అమలైతే ఆ వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద అమ్ముకునేందుకు ప్రణాళికలు రూపొందించిందని ఆరోపించారు. కేవలం ఏడాదికి రూ.15వేలు ఉండే వైద్య విద్య ఫీజును రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ ఫీజు రూ.20 లక్షలుగా నిర్ధారించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమేకాక రద్దు చేస్తామని ఎన్నికల్లో ప్ర కటించిన టీడీపీ, జనసేనలు గత ప్రభుత్వ విధానాలనే కొనసాగించేందుకు నిర్ణయించటం సరికాదన్నారు. దీని వల్ల భవిష్యత్తులో పేద, మధ్య తరగతి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినా భారీ ఫీజులు కట్టలేక వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ కొత్త వైద్య కళాశాలల్లో పీపీపీ పద్ధతి వద్దని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వివరించామని చెప్పారు. దీనిపై జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి జీ శ్రీనివాసరావు, కోశాధికారి సూర్యప్రకాశరావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య

సహచరులే చంపేశారు!

● నగరంలో యూపీ వాసి దారుణ హత్య ● సాంకేతికత ఆధారంగా నిందితుల గుర్తింపు
● తెనాలి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు?

నెల్లూరు (క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బతుకు తెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చారు. నెల్లూరులో ఓ గదిని అద్దెకు తీసుకొని రోజువారి పనులు చేసుకుంటూ పూట గడుపుతున్నారు. అంతా బాగున్నా వారిలో వారే గొడవ పడుతూ తమతో ఉన్న ఓ వ్యక్తిని బండరాయితో మోది హత్య చేశారు. అయితే, ఈ ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే సాంకేతికత ఆధారంగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, సేకరించిన సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని శాంట్‌కబీర్‌నగర్ జిల్లా బాండ్ల గ్రామానికి చెందిన జైహింద్ సహాని (40), ఇంద్రావతి దంపతులకు ముగ్గురు సంతానం. మూడు నెలల కిందట జైహింద్ సహాని ఉత్తరప్రదేశ్‌లోని సిదార్ధ్‌నగర్‌కు చెందిన పరదేశి గౌతమ్, రామ్‌కేశరిలను వెంటబెట్టుకుని ఉపాధి కోసం నెల్లూరుకు వచ్చారు. శ్రీనివాస నగర్ ఒకటవ వీధిలో ఓ రేకుల ఇంటిని ఈ ముగ్గురు అద్దెకు తీసుకొని శివ అనే మేస్త్రీ వద్ద ఉడ్ పాలీష్ పనులకు చేరారు. అయితే, జైహింద్ సహాని మద్యం మత్తులో సహచరులను ఇబ్బందులకు గురిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ముగ్గురు మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నెల 16వ తేదీ రాత్రి ముగ్గురూ భోజనం చేస్తుండగా గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన పరదేశిగౌతమ్, రామ్‌కేశరిలు పక్కనే ఉన్న బండరాయిని తీసుకొని జైహింద్ సహాని తలపై బలంగా మోదడంతో తలపగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో నిందితులు ఇంటి తలుపునకు గడియ పెట్టి అక్కడ నుంచి పరారయ్యారు.



మృతుడు జైహింద్ సహాని (ఫైల్)

● మృతుడి బంధువులకే చెప్పి..

మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నిందితులు నవాబుపేటలో ఉన్న మృతుడి మేనకోడలు శకుంతలకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. 'మీ మామను చంపేశాం. వచ్చి చూసుకోండని అనడంతో ఆమె తన భర్త సోను సుహానికి చెప్పారు. దీంతో ఆయన హుటాహుటిన ఘటన జరిగిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. తలుపులు తెరిచి చూడగా రక్తపు మడుగులో జైహింద్ సహాని మృతదేహం కనిపించింది. ఈ మేరకు ఆయన నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సాంకేతిక ఆధారంగా నిందితులు రైలులో పారిపోతున్నారని గుర్తించారు. తెనాలి సమీపంలో అక్కడి పోలీసుల సహకారంతో నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని, నెల్లూరుకు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.